# ఆరోగ్య బీమా రంగంలో స్టార్ హెల్త్ రికార్డుల పరంపర

## తెలుగు రాష్ట్రాల్లో 40 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానం

**హైదరాబాద్ బ్యూరో మే 5 (నినాదం)**

దేశీయ రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న 'స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్' తన విజయ యాత్రను కొనసాగిస్తోంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలను తమ అత్యంత కీలక మార్కెట్లుగా భావిస్తున్న ఈ సంస్థ, ఇక్కడ రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ విభాగంలో ఏకంగా 40 శాతానికి పైగా మార్కెట్ వాటాను కైవసం చేసుకుంది. ఈ మేరకు కంపెనీ ఉన్నతాధికారులు నిర్వహించిన మీడియా సమావేశంలో పలు ఆసక్తికర గణాంకాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో 31 శాతం మార్కెట్ వాటాతో నంబర్ వన్ స్థానంలో ఉన్న స్టార్ హెల్త్, మొత్తం జనరల్ ఇన్సూరెన్స్ రంగంలో ఏడవ అతిపెద్ద సంస్థగా నిలిచింది. కేవలం హెల్త్ ఇన్సూరెన్స్ మాత్రమే అందిస్తూ ఈ స్థాయికి చేరుకోవడం విశేషం. 18,000 మందికి పైగా ఉద్యోగులతో ఈ రంగంలోనే అతిపెద్ద




ఉపాధి కల్పన సంస్థగా నిలిచిన స్టార్ హెల్త్, 900 బ్రాంచ్ ఆఫీసులు, 8.5 లక్షల మంది ఏజెంట్లు, మరియు 15,000కు పైగా నెట్‌వర్క్ హాస్పిటల్స్‌తో దేశం నలుమూలలకూ విస్తరించింది. ప్రస్తుతం 2.8 కోట్ల మందికి పైగా వ్యక్తులకు ఈ సంస్థ ఆరోగ్య భద్రత కల్పిస్తోంది.కస్టమర్ నమ్మకమే పునాదిగా పనిచేసే స్టార్ హెల్త్, క్లెయిమ్‌ల పరిష్కారంలో సరికొత్త రికార్డులను సృష్టించింది. ఏఐ మరియు డేటా సైన్స్ సాయంతో 92 శాతం క్లెయిమ్‌లను కేవలం 3 గంటల లోపే పరిష్కరిస్తూ, ప్రతి నిమిషానికి సగటున 4 క్లెయిమ్‌లను ప్రాసెస్ చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం 2026 లో సుమారు 30.6 లక్షల క్లెయిమ్‌ల కింద రూ. 12,000 కోట్లను పంపిణీ చేయగా, కంపెనీ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు మొత్తం రూ. 68,000 కోట్ల క్లెయిమ్‌లను సెటిల్ చేసింది. అంతేకాకుండా, దేశంలోనే అత్యధికంగా 85 శాతం క్యాష్‌లెస్ సౌకర్యాన్ని అందిస్తూ రోగులకు ఆర్థిక భారం లేకుండా చేస్తోంది. సాంకేతికత కోసం ఏటా రూ. 250 కోట్ల వరకు ఖర్చు చేస్తున్న స్టార్ హెల్త్, తన మొబైల్ యాప్ ద్వారా వినూత్న సేవలను అందిస్తోంది. ఇందులో భాగంగా ఇజ్రాయెలీ టెక్నాలజీ సాయంతో ఫోన్ కెమెరా ద్వారా ముఖాన్ని స్కాన్ చేసి, ఒక నిమిషంలో రక్తంలో చక్కెర స్థాయి వంటి కీలక ఆరోగ్య పారామితులను 95 శాతం ఖచ్చితత్వంతో తెలియజేసే ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. అలాగే చిన్నపాటి అనారోగ్యాలకు ఆసుపత్రికి వెళ్లే పనిలేకుండా 300 నగరాల్లో 'ఇంటి వద్దకే వైద్యం' అందిస్తోంది.లాభమే ధ్యేయం కాకుండా సిఎస్ఆర్ కింద




పిరమల్ హెల్త్ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా 32 ఉచిత క్లినిక్‌లను నడుపుతూ, సామాన్యులకు ఉచితంగా డాక్టర్ సంప్రదింపులు, మందులు మరియు పరీక్షలు అందజేస్తోంది. వచ్చే 2028 నాటికి రూ. 30,000 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందుకోసం సామాన్యులకు మరింత చేరువయ్యేలా 'లీప్' (లివింగ్ ఎఫెక్టివ్ ఆఫర్డబుల్ ప్లాన్ ) అనే సరికొత్త సరసమైన ఇన్సూరెన్స్ ప్లాన్‌ను త్వరలోనే మార్కెట్లోకి తీసుకురానున్నారు. హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ ఎత్తివేయడం వల్ల ఈ రంగం మరింత వృద్ధి చెందుతుందని, ప్రతి కుటుంబానికి ఆరోగ్య రక్షణ లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వేసవి కాలంలో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు





## కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం ప్రతినిధి, మే 5 (నినాదం )**

వేసవికాలంలో త్రాగునీటి సమస్య లు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ త్రాగునీటి సరఫరాపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమన్వయం ఉండాలని, ఫీల్డ్ స్థాయిలో అవసరమైన సమన్వయం చేసి సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పీక్ సమ్మర్ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అధికారులు కార్యాలయా లకు పరిమితం కాకుండా ఫీల్డ్‌లోనే ఉండి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని, ఎంపీడీఓలు, ఎంపీఓలు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాసేవలో స్పందన అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. త్రాగునీటి సమస్యలు కేవలం ఆర్డబ్ల్యూఎస్ శాఖకు మాత్రమే సంబంధించినవి కావని, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మే నెలలో త్రాగునీటి సమస్యలు తలెత్తే అవకాశముండటంతో ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు, నష్టాలను వెంటనే పరిష్కరించాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే తెలియజేయాలని సూచించారు. రోడ్డు పనుల సమయంలో పైప్‌లైన్ దెబ్బతిన్నట్లయితే సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా ఖర్చు భరింప జేయాలని తెలిపారు.మండలాల వారీగా త్రాగునీటి పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, మొదట మిషన్ భగీరథ నీరు ప్రజలకు చేరేలా చూడాలని, తదుపరి స్థానిక వనరులను వినియోగించాలని, అవసరమైతే బోర్వెల్ ఏర్పాటు చేయాలని, చివరిగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని దశలవారీ చర్యలు సూచించారు. ఎత్తైన గ్రామాలకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటినీ సరఫరా చేయాలని, సమస్య తలెత్తిన వెంటనే స్పందించాలని తెలిపారు. త్రాగునీటి సమస్యలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియో గించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన త్రాగునీటి నిధులను జెడ్పీ సీఈఓ సమన్వయంతో అవసరమైన చోట వినియోగించాలని సూచించారు. సరఫరా లేని ఇళ్లను గుర్తించి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.వేసవి కాలంలో వీధి జంతువులు, చిన్న పక్షులు కూడా నీటి కొరతను ఎదుర్కొంటా యని, గ్రామాలు, మున్సిపాలిటీలలో స్థానిక సంస్థలు చిన్న, చిన్న నీటి గుంతలు (వాటర్ పిట్స్) ఏర్పాటు చేసి వాటికి తగినంత నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.హీట్ వేవ్ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని ఒఆర్ఎస్ ప్యాకెట్లను పోలీస్ ఎస్‌హెచ్‌ఓలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుప త్రులు, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. సన్‌స్ట్రోక్ బాధితుల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, తగిన ఓఆర్ఎస్ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.లేబర్ శాఖతో సమన్వయం చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కోచింగ్ సెంటర్లు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు బయట నిద్రించకుండా అవగాహన కల్పించాలని, మార్కెట్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రజా ప్రదేశాల్లో త్రాగునీరు, ఒఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిపిఓ రాంబాబు, సిపిఓ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మిషన్ భగీరథ ఎస్ఈ, ఈఈ, ఎస్ఈ పి.హెచ్., గ్రౌండ్ వాటర్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఏపిడిలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం

## ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణపై రూపొందించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి దామోదర్ రాజానర్సింహా



**సంగారెడ్డి బ్యూరో, మే 5 (నినాదం):-**

హైదరాబాద్ నగరంలో చిత్రపురి ఫిల్మ్ ఫెస్టివల్ వరల్డ్స్ 1st ఫార్మాట్ & ఇండియాస్ బిగ్గెస్ట్ ఫెస్టివల్ నిర్వహణ పై రూపొందించిన వాల్ పోస్టర్ ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని తన నివాసంలో ఆవిష్కరించారు. హైదరాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫార్మా, ఐటీ హబ్ గా హైదరాబాద్ కు ప్రపంచ వ్యాప్త గుర్తింపు కు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారన్నారు. హైదరాబాద్ లో మెడికల్ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరానికి మిడిల్ ఈస్ట్, యూరోపియన్ దేశాలు, ఆఫ్రికా లాంటి దేశాల నుంచి పెద్ద ఎత్తున వైద్య సేవల కోసం వస్తున్నారన్నారు. ఫిల్మ్ ఫెస్టివల్స్ కి హైదరాబాద్ వేదిక కావడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నామన్నారు. దేశం లోని సినిమా, OTT, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాలలో ప్రభావితం చేసే ముఖ్యమైన వ్యక్తులందరూ హైదరాబాద్ లో జరిగే ఫిల్మ్ ఫెస్టివల్ లో పాల్గొనే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్ లో 43 దేశాల నుండి ప్రతినిధులు హాజరు అవుతున్నారని, దేశంలో 8 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు , ఫిల్మ్ మేకర్స్ పాల్గొంటారని నిర్వాహకులు మంత్రికి వివరించారు. దేశం లో సినిమా, Ott, ఇన్స్టాగ్రామ్ , యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్లు అందరు ఒక్క వేదిక పైకి రావడం ఇదే మొదటిసారని తెలిపారు.



## ఆరోగ్య సేవలు గ్రామస్థాయిలో ప్రజలకు సమర్ధవంతంగా అందించాలి

### జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్

**హుజూర్ నగర్, మే 5 (నినాదం):**

ఆరోగ్య సేవలో గ్రామస్థాయిలో ప్రజలకు సమర్ధవంతంగా అందించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్ తెలిపారు. జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై డాక్టర్ ప్రసిద్ లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆరోగ్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు ప్రతి ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రత్యేకంగా క్షయ, కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం, హెచ్ పి వి వ్యాక్సిన్,తల్లీబిడ్డల ఆరోగ్యం, టీకాల కార్యక్రమం, నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల నియంత్రణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ స్థాయి వరకు సేవలు అందేలా ఫీల్డ్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే, గర్భిణీలు మరియు బాలింతలకు అందించే సేవలను మరింత మెరుగుపరచాలని, ప్రతి లబ్ధిదారునికి సమయానికి సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్, సి హెచ్ ఓ. పద్మ, పీహెచ్ఎన్ఓ పద్మ, సూపర్ వైజర్ పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్ ఆరోగ్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## బంగారు వ్యాపారులతో డీఎస్పీ భద్రతా సమీక్ష

**హుజూర్ నగర్, మే 5 (నినాదం):**

హుజూర్ నగర్ నగదు, ఆభరణాల రక్షణపై గోల్డ్ షాప్ అసోసియేషన్ సభ్యులతో డీఎస్పీ శ్రీనివాస్ మంగళవారం సమావేశం నిర్వహించారు. వ్యాపారస్తులు షాపుల్లో అత్యాధునిక సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో పోలీస్ బీట్ పెంచామని, విలువైన నగలను సేఫ్ లాకర్లలోనే ఉంచాలని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలతోనే నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో సిఐ. చర మందరాజు, ఎస్ఐ మోహన్ బాబు గోల్డ్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలే...

## అధికారుల విధుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్...

## రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తాం... జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి...





**ఆర్మూర్, ఏప్రిల్ 5 ( నినాదం):**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం సాయంత్రం, జిల్లా జేసి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవియా, డి ఆర్ డి ఏ అధికారులు, కలెక్టర్ తో పాటు ఆకస్మికంగా విచ్చేసి మోర్తాడ్ గ్రామంలోని ఈద్గా వద్ద గల మైదానంలో రైతులు ఆరబోసిన, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని, సొసైటీ ఆధ్వర్యంలో మోర్తాడ్ గ్రామం ధోన్ పాల్, వడ్యాట్ గ్రామాలకు వెళ్లే రహదారి పక్కనే ఏర్పాటుచేసిన సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని, వరి ధాన్యం కుప్పలను జిల్లా కలెక్టర్ స్వయంగా రైతుల కుప్పలను సందర్శించి పరిశీలించారు. అంతేకాకుండా రైతులను సమస్యలను జిల్లా కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ గత నెల రోజుల నుండి దొడ్డు వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, అంతే కాకుండా సన్నం ధాన్యాన్ని కొనుగోలు చేసినప్పటికీ కూడా, మిల్లర్లు 10 కిలోల తరుగు అడుగుతున్నారని, క్వింటాల్కు 10 కిలోల తరుగు తీస్తే రైతులు బతికేదేలాని, అంతేగాకుండా ప్రభుత్వం ముందస్తుగా సమాచారం ఇచ్చి ఉంటే తాము దొడ్డు వరి ధాన్యాన్ని పండించే వారం కాదని, మండల అధికారులు పర్యవేక్షించాల్సిన అధికారులే స్వయంగా పర్యవేక్షించకపోవడం, రైస్ మిల్లర్లతో కుమ్మక్కు కావడం వల్లే రైతులకు ఈ పరిస్థితి ఏర్పడిందని అనుమానాలు వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రధానంగా సొసైటీ కేంద్ర నిర్వాహకులు ముందు వచ్చిన వారి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం, పైరవీలు చేసిన వారి ధాన్యాన్ని ముందుగ కొనుగోలు చేయడం, కనీసం రికార్డులలో కొనుగోలు చేసిన ధాన్యం రికార్డులు నమోదు చేయకపోవడం, కొనుగోలు కేంద్రాల నిర్వహణ అధికారులను కలెక్టర్ స్వయంగా పరిశీలించడంతో అధికారులకు విధుల పట్ల ఏ పార్టీ చిత్తశుద్ధి ఉందో, ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారో కలెక్టర్ స్వయంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను, పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యంగానే రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ అర్థం చేసుకున్నారు. దీంతో ఇకనైనా కొనుగోలు కేంద్రంలో, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు తరలించాలని, అనంతరం మిగతా రైతుల ధాన్యాన్ని వెంట వెంటనే రైతుల కుప్పలుగా పడి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి, వాహనాలనుసమకూర్చి లారీలలో ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు తరలించి, రైతులకు ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సంబంధిత వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. రైతులు ఎలాంటి అధైర్య పడవద్దని 10 రోజులలో దొడ్డు, అన్నం ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన రైతుల రికార్డులను నమోదు చేయాలని, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని, సంబంధిత అధికారులు నిత్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని, వాహనాల కొరత ఏర్పడితే వాహనాలను సమకూర్చాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విధుల పట్ల జాప్యం చేసిన మోర్తాడ్ సొసైటీ కార్యదర్శి కాశిరాం, సొసైటీ లో విధులు నిర్వహిస్తున్న దిలీప్ అనే ఉద్యోగికి షోకాస్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మోర్తాడ్ తాసిల్దార్ ను ఉద్దేశించి కొనుగోలు కేంద్రాలపై దృష్టి సాధించకుండా, భూభారతి పనులపై దృష్టి సారించకుండా, కేవలం ఇసుక మీదనే దృష్టి పెట్టి, విధులు సైతం సక్రమంగా నిర్వర్తించడం లేదని, మీడియా ఉండడం వల్ల ఏమి అనలేకపోతున్నానని మండల తాసిల్దార్ విధుల పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మోర్తాడ్, దోన్ పాల్ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న సమస్యలను తెలుసుకొని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని రైతులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం కమ్మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట్ రవి మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసి తమ మండలంలో సైతం ఇదే పరిస్థితి నెలకొందని, రైతుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ కమ్మర్పల్లి మండలాలను సైతం సందర్శించి పరిశీలించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు న్యాయం చేయడమే తన విధి అని రైతులకు జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ రాకతో రైతుల్లో జిల్లా కలెక్టర్ విధి నిర్వహణ తీరుపట్ల, ఇలాంటి జిల్లా కలెక్టర్ లు జిల్లాకు ఒకరు ఉంటే , జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తవని రైతులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట జె.సి. కిరణ్ కుమార్, మార్క్ అధికారులు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల వియా, డీ ఏవో. జిల్లా అధికారి, డి ఆర్ డి ఏ జిల్లా అధికారి ఎండిఓ సాయన్న, డి సి ఓ, తాసిల్దార్ చిలుక కృష్ణ, ఎంపీడీవో తిరుమల, ఏవో, హరీష్, ఏ ఈ ఓ లు, ఏపీఎం, ఐకెపి సీసీలు తడకల శ్రీనివాస్, మహేందర్, సంతోష్, వివో లు, సిఏలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణ మిల్లులో దిగుమతి పెంచాలి

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**నల్లగొండ ప్రతినిధి మే 5 (నినాదం)**

రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు . పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు,టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సప్లై కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు . అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్ధార్థ రైస్ ఇండస్ట్రీస్ ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని? అడగగా 35 మంది ఉన్నారని తెలిపారు. ఆన్ లోడింగ్, వెహికల్ రోటేషన్ పెంచాలని చెప్పారు.అంతేకాక సిస్టం ద్వారా ధాన్యం వివరాల అప్లోడింగ్ ,ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సప్లైస్ కమీషనర్ ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం డి ఎం. రాంపతి నాయక్, డీసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు.

## కాటారం ఆర్డీవోగా రవీందర్ నియామకం

**కాటారం, మే 05(నినాదం ):**

కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి రెవెన్యూ డివిజన్ అధికారిగా డీ. రవీందర్ ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి లోకేష్ కుమార్ కు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు కాటారం సబ్ కలెక్టర్ గా పనిచేసిన మయాంక్ సింగ్ ను ఇటీవల జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ప్రస్తుతం హైదరాబాద్ రెరా కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న రవీందర్ను కాటారం ఆర్డీవోగా నియమించారు.

# వరద కాలువ జనరేటర్, ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు

## భారీ మధ్యతరహానీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల, మే 5 (నినాదం)**



కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గం గుండా ప్రవహించే శ్రీరాంసాగర్ వరద కాలువ గేట్ల అత్యవసర నిర్మాణానికి డీజిల్, జనరేటర్ కు రూ. 49 లక్షలు, మెట్ పల్లి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ నిర్మాణం కోసం రూ.92 లక్షలు నిధులు తెలంగాణ రాష్ట్ర భారీ మధ్యతరహానీటి పారుదల మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలి పారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో మంగళవారం జువ్వాడి కృష్ణారావు టెలి ఫోన్ లో మాట్లాడుతూ కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ప్రతిపాదన మేరకు తెలంగాణ రాష్ట్ర భారీ మధ్యతరహా నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి ఈ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణం, జనరేటర్ కొనుగోలు పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర భారీ మధ్యతరహానీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ స్థలం దర్జాగా కబ్జా

## తెల్లారే కల్లా వెలసిన డబ్బా కొట్టు?

## తొలగించాలని కమిషనర్ చైర్పర్సన్ కు ఫిర్యాదు



**కోదాడ,మే 5(నినాదం):**

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 32 వ వార్డులో నీ యాదవ నగర్ లో తెల్లారే కల్లా మున్సిపాలిటీ స్థలంలో భారీ డబ్బా కొట్టు వెలసింది... ఆ వార్డుకు చెందిన ఓ నాయకుడు ప్రమేయంతోనే ఈ నిర్వాకం జరిగినట్టు అవార్డుకు చెందిన పలువురు ఆరోపిస్తున్నారు... ఇప్పటికే కోదాడ ప్రధాన రహదారి పక్కన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణకు , టెలికాం కార్యాలయం ప్రహరి గోడ ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో కొందరు స్వార్ధపరులు ఇష్టారాజ్యంగా డబ్బా కోట్లు ఏర్పాటు చేసుకొని అద్దెలకు ఇవ్వడం అందరికీ తెలిసిందే... ఇలా మున్సిపాలిటీ స్థలాలను ఆక్రమించుకొని దాదాపు 150 నుంచి 200 బడ్డీ కోట్లు నిర్వహిస్తున్నారు.. దీంతోపాటు పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధులకు ఇరువైపుల కాలువలపై కూడా చిన్న చిన్న బడ్డీకొట్లు నిర్వహిస్తున్నారు.. గతంలో సదరుబడ్డి కొట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరిగాయి తప్పితే తొలగించలేదు .. ఈ పరిణామంలో తాజాగా 32 వ వార్డులో మున్సిపాలిటీ వాహనాలు నిలిచే స్థలంలో ఓ భారీ డబ్బా కొట్టు వేస్తుంటే మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని ఆ వార్డు ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి..

**తక్షణమే బడ్డీ కొట్టును తొలగించాలి... మాదల ఉపేందర్**

2 వ వార్డులో మున్సిపాలిటీ వాహనాలు నిలిచే స్థలాన్ని కబ్జా చేసి అందులో ఏర్పాటుచేసిన బడ్డీ కొట్టును తక్షణమే తొలగించాలి.. గతంలో సదరు మునిసిపల్ స్థలంలో గ్రంథాలయం నిర్వహించారని, అది శిధిలం కావడంతో చదును చేసి మున్సిపాలిటీ వాహనాలు నిలిచేందుకు వినియోగించుకుంటున్నారు.. అయితే ఇప్పుడు ఆ వార్డులోని ఓ నాయకుడు అక్రమంగా బడ్డీ కొట్టును ఏర్పాటు చేసుకుని అద్దెకించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు.. తక్షణమే మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్ జోక్యం చేసుకొని సదరు బడ్డీ కొట్టును తొలగించి మున్సిపల్ స్థలాలు అక్రమ గురికాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను



# బాలికల ఉన్నత పాఠశాలను ఎందుకు మూసివేశారు

**మిరుదొడ్డి, మే 5 (నినాదం)**



మండల కేంద్రంలో 2005- 2006 విద్యాసంవత్సరంలో ప్రారంభించబడిన బాలికల ఉన్నత పాఠశాల ఎందుకు ఎవరు మూసివేశారు కారణాలేంటో తెలియవలసి ఉంది.2022-2023 వరకు నడిపించబడిన పాఠశాలను గోప్యంగా మూసివేయడం పై పలు ఆరోపణలు ఉన్నాయి.మూసివేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా విషయం బయటకు రాకుండా రహస్యంగా మూసివేతపై పలువురు మండి పడుతున్నారు. గ్రామస్థులు ఎంతో కృషి చేసి ఏర్పాటు చేసుకున్న పాఠశాల మూడవ కంటికి తెలియకుండా మూసి వేతకు కారకులు ఎవరు అంటూ చర్చ సాగుతోంది.నడుస్తున్న పాఠశాల మూసి వేయాలంటే మండల విద్యాధికారి పరిశీలన, జిల్లా విద్యాధికారి నివేదికలు జిల్లా కలెక్టర్ కు అందించి కలెక్టర్ అనుమతితోనే పాఠశాలను మూసి వేయవలసి ఉంటుంది.ఇవేమీ లేకుండా ఎలా మూసివేస్తారు... కారకులు ఎవరో పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్ట రీత్యా చర్యలు తీసుకొని పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజల ఆకాంక్షలను

# బిజెపి గౌరవించాలి !

సంపాదకీయం

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బిజెపి ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బిజెపి రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బిజెపి హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటుదారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్యం కాదన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవలు సద్దుమణగవు. ఒక్కొకక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బిజెపి పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి. యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు. ఇకపోతే తమిళనాటు విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు. ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కుకోగలరు. కేరళలో యుడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృతమనే చెప్పాలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు. భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బిజెపి ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన పాలన దిశగా బిజెపి కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావడానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోదీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతో పాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళ్లుగా స్వేచ్ఛ లేకుండా పోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయ లో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బిజెపి గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బిజెపి పట్ల అనురాగం పెరగాలి. ఇజెపికి ఓటేసినందుకు ప్రజలు ఆనందపడాలి. అందుకు అనుగుణంగా పాలనా పరమైన మార్పులు రావాలి. రాజకీయ పందురాలకు, ఉచిత పథకాలకు దూరంగా ఉండాలి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులను అభివృద్ధికే వినియోగించాలి. అప్పుడే బిజెపిని మరోమారు ప్రజలు నమ్ముతారు. అందుకు కఠినమైన నిర్ణయాలకు కూడా వెనకాడరాదు.

## ద్రవిడ గడ్డపై నవ సంచలనం..

# బెంగాల్ కోటలో కమల కేతనం

**భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2026 నాటి పంచ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కేవలం ఒక సాధారణ అధికార మార్పిడి ఘట్టాలుగా కాకుండా, దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసిన చారిత్రక పరిణామాలుగా విశ్లేషించ బడుతున్నాయి. అస్సాం బ్రహ్మపుత్ర తీరం నుండి బెంగాల్ గంగమ్మ ఒడి వరకు, కేరళ కొబ్బరి తోటల నుండి తమిళనాడు ద్రవిడ కోటల వరకు విస్తరించిన ఈ ఎన్నికల పోరులో భారతీయ ఓటరు తన పరిణతిని చాటుకున్నాడు. దశాబ్దాల రాజకీయ ఆధిపత్యాలను సవాలు చేస్తూ, సరికొత్త శక్తులకు పట్టం కడుతూ, అభివృద్ధి మరియు సిద్ధాంతాల మేళవింపుతో వెలువడిన ఈ ఫలితాలు జాతీయ రాజకీయాల్లో నవ శకానికి నాంది పలికాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీల విస్తృతిని, ప్రాంతీయ సమీకరణాల మార్పును మరియు యువత రాజకీయ ఆకాంక్షలను స్పష్టంగా ప్రతిబింబించాయి.**

### 2026 ఎన్నికల అంతరార్థం

**2026 ఎన్నికల సునామీ: కుప్ప కూలిన పాత కోటలు.. ఆవిర్భవించిన కొత్త శక్తులు!**

**బహుముఖ పోరు.. అద్భుత తీర్పు: భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన 'పంచ' రాష్ట్రాలు!**



ఉత్తర తూర్పు భారతావనిలో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన అస్సాం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (NDA) సాధించిన విజయం ఒక అప్రతిహత రాజకీయ ప్రస్థానానికి నిదర్శనంగా నిలిచింది. 126 స్థానాలు కలిగిన అస్సాం అసెంబ్లీలో ఎన్డీఏ ఏకంగా 102 స్థానాలను కైవసం చేసుకోవడం, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమిని కేవలం 21 స్థానాలకే పరిమితం చేయడం ఒక చారిత్రక రికార్డు. 2016లో మొదటిసారి అధికారంలోకి వచ్చిన నాటి నుండి, 2021లో పట్టు నిలుపుకుని, ఇప్పుడు 2026లో వరుసగా మూడవ సారి అఖండ మెజారిటీతో హ్యాట్రిక్ సాధించడం ద్వారా భాజపా ఈశాన్య భారతంలో తన అజేయ శక్తిని చాటుకుంది. ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణం ప్రభుత్వం అమలు చేసిన సమగ్ర అభివృద్ధి నమూనా. మారుమూల ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మించిన భారీ వంతెనలు, రహదారులు, మరియు మౌలిక సదుపాయాల కల్పన అస్సాం ప్రజల్లో అభివృద్ధిపై గట్టి నమ్మకాన్ని కలిగించింది. దీనికి తోడు, అక్రమ వలసల విషయంలో ప్రభుత్వం అవలంబించిన కఠిన వైఖరి, జాతీయ పౌర పట్టిక (NRC) అమలుపై ఉన్న స్పష్టత, మరియు స్థానిక సంస్కృతిని కాపాడే ప్రయత్నాలు గిరిజన మరియు స్థానిక వర్గాలను భాజపా వైపు మొగ్గు చూపేలా చేశాయి. కాంగ్రెస్ పార్టీ బలమైన నాయకత్వం లేక, క్షేత్రస్థాయిలో ఉనికిని కోల్పోవడం కూడా ఎన్డీఏకు ఇంతటి భారీ మెజారిటీ రావడానికి మార్గాన్ని సుగమం చేసింది.

దేశవ్యాప్త రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేసిన పరిణామం పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. గత దశాబ్ద కాలానికి పైగా బెంగాల్ గడ్డపై ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కోటను కూల్చివేస్తూ భాజపా సాధించిన విజయం జాతీయ రాజకీయాల్లోనే అత్యంత కీలక మలుపు. 293 స్థానాలు కలిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో భాజపా 206 స్థానాలతో అఖండ విజయాన్ని నమోదు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. గతంలో ఎదురులేని శక్తిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కేవలం 81 స్థానాలకే పరిమితం కాగా, కాంగ్రెస్ పార్టీ నామమాత్రంగా 2 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాజకీయ హింస, అవినీతి ఆరోపణలు, మరియు పాలనాపరమైన అసంతృప్తి బెంగాల్ ఓటర్లలో ఒక నిశ్శబ్ద విప్లవానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లడంలో భాజపా విజయం సాధించింది. సామాజిక సమీకరణాలను తమకు అనుకూలంగా మార్చుకోవడమే కాకుండా, పరిపాలనలో మార్పు రావాలని కోరుకున్న యువత మరియు మధ్యతరగతి ఓటర్లు భాజపాకు బాసటగా నిలిచారు. ఈ విజయం ద్వారా దేశంలో 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఏకైక పార్టీగా భాజపా తన ప్రాబల్యాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

దక్షిణ భారత రాజకీయాలలో సుదీర్ఘ కాలంగా 'మార్పు'కు వేదికగా నిలిచే కేరళ రాష్ట్రం ఈసారి కూడా తన సాంప్రదాయాన్ని కొనసాగించింది. గత ఎన్నికల్లో సాంప్రదాయక పద్ధతిని పక్కన పెట్టి వరుసగా రెండోసారి ఎల్డీఎఫ్‌కు పట్టం కట్టిన కేరళ ప్రజలు, ఈసారి తిరిగి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (UDF)ను అధికార పీఠంపై కూర్చోబెట్టారు. 140 స్థానాల కేరళ అసెంబ్లీలో యూడిఎఫ్ 102 స్థానాలను కైవసం చేసుకుని తన సత్తా చాటగా, అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకు పడిపోయింది. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు, నిరుద్యోగ సమస్య, మరియు విదేశీ పెట్టుబడుల కొరత వామపక్ష కూటమి పతనానికి కారణమయ్యాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ ప్రచారంలో చూపిన సమన్వయం, యువ ఓటర్లను ఆకట్టుకునేలా రూపొందించిన ప్రణాళికలు ప్రజల్లో మార్పు పట్ల ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా విద్యావంతులైన కేరళ ఓటర్లు పరిపాలనలో నూతన జవజీవాలు రావాలని కోరుకుంటూ యూడిఎఫ్‌కు స్పష్టమైన తీర్పునిచ్చారు.



భారత రాజకీయ యవనికపై 2026 ఎన్నికల్లో అత్యంత సంచలనాత్మక మలుపు తమిళనాడులో వెలువడింది. దశాబ్దాలుగా ద్రవిడ మున్నేట్ర కజగం (DMK) మరియు అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (AIADMK)ల మధ్యే సాగుతున్న తమిళ రాజకీయాల్లోకి మూడవ శక్తిగా సినీ నటుడు విజయ్ ప్రవేశించడం, ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం టి వి కె పార్టీ అపూర్వ విజయాన్ని సాధించడం ఒక అద్భుతం. 234 స్థానాల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాల చరిత్ర కలిగిన డీఎంకే 73 స్థానాలకు, ఏఐఏడీఎంకే 53 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇది కేవలం ఒక నటుడి గ్లామర్ విజయం మాత్రమే కాదు, ద్రవిడ రాజకీయాల పేరుతో సాగుతున్న అవినీతి, వారసత్వ రాజకీయాలపై తమిళ ప్రజల ఆగ్రహానికి నిదర్శనం. యువతలో ఉన్న విపరీతమైన ఆదరణను విజయ్ తన రాజకీయ సిద్ధాంతాలతో మేళవించి, క్షేత్రస్థాయిలో బలమైన పునాదిని నిర్మించు కున్నారు. పారదర్శక పాలన, కులాలకు అతీతమైన రాజకీయం, మరియు తమిళ అస్తిత్వాన్ని కాపాడుతూనే ఆధునిక అభివృద్ధిని కాంక్షించే ఆయన విధానం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఇది భవిష్యత్తులో తమిళనాడులో ద్విధ్రువ రాజకీయాలకు స్వస్తి పలికి, సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయాలకు మార్గం చూపింది.

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో సైతం ఓటరు తీర్పు అభివృద్ధికి అనుకూలంగా వెలువడింది. 30 స్థానాలు కలిగిన పుదుచ్చేరి అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి 18 స్థానాలను సాధించి తన అధికారాన్ని నిలబెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలకే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ఉంటేనే చిన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని పుదుచ్చేరి ప్రజలు భావించారు. పర్యాటక రంగం, మౌలిక వసతుల కల్పనలో వచ్చిన మార్పులు ఓటర్లను ఆకర్షించాయి. స్థానిక నాయకత్వం మరియు కేంద్రం మధ్య ఉన్న అవగాహన పుదుచ్చేరిలో రాజకీయ స్థిరత్వాన్ని కలిగించింది.

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను సమగ్రంగా పరిశీలిస్తే భారత రాజకీయాల్లో కొన్ని కీలక ధోరణులు స్పష్టమవు తున్నాయి. మొదటిది, ప్రజలు ఇప్పుడు కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఫలితాలను ఇచ్చే 'నిష్పాక్షిక అభివృద్ధి' వైపు మొగ్గు చూపుతున్నారు. అస్సాం మరియు బెంగాల్ ఫలితాలు దీనికి నిదర్శనం. రెండవది, యువ ఓటర్ల పాత్ర గతంలో కంటే నిర్ణయాత్మకంగా మారింది. తమిళనాడులో విజయ్ పార్టీ సాధించిన విజయం, యువత ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎంత ఆకలితో ఉన్నారో తెలియజేస్తోంది. మూడవది, సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న పార్టీలపై ఉన్న వ్యతిరేకత క్షేత్రస్థాయిలో బలంగా పనిచేస్తోంది. కేరళ మరియు బెంగాల్ ఫలితాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. నాలుగవది, జాతీయ పార్టీలు ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ తన ఉనికిని దక్షిణాది మరియు తూర్పు రాష్ట్రాల్లో గణనీయంగా విస్తరించు కుంటోంది. ప్రస్తుతం దేశంలోని 21 రాష్ట్రాలలో అధికారంలో ఉండటం ద్వారా భాజపా జాతీయ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగింది.



మరోవైపు, ప్రాంతీయ పార్టీలు కూడా తమ మనుగడ కోసం సిద్ధాంతపరమైన మార్పులను చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేశాయి. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని విజయ్ పార్టీ సవాలు చేయడం అనేది ప్రాంతీయ రాజకీయాల్లో వస్తున్న పెనుమార్పులకు సంకేతం. ఎన్నికల ప్రచార శైలిలో కూడా విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచారం ఓటర్ల ఆలోచనలను ప్రభావితం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. తమిళనాడులో విజయ్ పార్టీ మరియు బెంగాల్‌లో భాజపా ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకున్నాయి.

2026 పంచ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని వైవిధ్యతను మరియు చైతన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయి. ఓటరు తన తీర్పు ద్వారా సుస్థిరతకు, అభివృద్ధికి మరియు సరికొత్త మార్పులకు పట్టం కట్టాడు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటముల లెక్కలు మాత్రమే కాకుండా, రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఒక దిక్సూచీగా నిలుస్తున్నాయి. అభివృద్ధి పరమావధిగా, ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సాగే రాజకీయాలకే భవిష్యత్తు ఉంటుందని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. జాతీయ రాజకీయ యవనికపై కొత్త నాయకత్వాలు, సరికొత్త సమీకరణాలు ఆవిర్భవించడంతో భారత ప్రజాస్వామ్యం మరింత పరిణతి చెందిన దిశగా అడుగులు వేస్తోంది. ఈ చారిత్రక పరిణామాలు దేశ రాజకీయ దిశను, దశను మార్చి వేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అభివృద్ధి, పారదర్శకత మరియు ప్రజా ఆకాంక్షలను గౌరవించే రాజకీయ ప్రస్థానానికి ఈ ఫలితాలు ఒక బలమైన పునాదిగా నిలుస్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# డిజిటల్ యుగంలోనూ బాడీ షేమింగ్ అనాచారమా

**(మే 06న "అంతర్జాతీయ ఆహార రహిత (నో డైయట్) దినోత్సవం" సందర్భంగా)**

'బాడీ షేమింగ్' లేదా 'శరీర అవమానం' లేదా 'శరీర నింద' అనే దురాచారం నేటికీ సమాజంలో కనిపిస్తున్నది. మహిళలు బాడీ షేమింగ్ కారణంగా మహిళలు నిత్యం ఎంతో మనోవేదనకు లోనవుతుంటారు. లావుగా ఉందని, బక్కగా ఉందని, నల్లగా ఉందని, అందవిహీనంగా ఉందని పలు రకాలుగా మహిళలను వేధించే దుర్మార్గులు మనకు కనిపిస్తారు. ఇలాంటి బాడీ షేమింగ్ ప్రభావంతో మన ఆహారపు అలవాట్లు కూడా ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది. మన శరీర రూపం, పరిమాణం, రంగు లాంటివి మన చేతిలో ఉండవు. పుట్టుకతో, జన్యుపరమైన కారణాలతో మన శరీర నిర్మాణం ఆధారపడి ఉంటాయి. ఇలా నిత్యం కామెంట్లు వినే మహిళలు తమ ఆహార నియమాలను పాటిస్తూ, ఉపవాసాలు లేదా ఆహారం తీసుకోకపోవడం కూడా జరుగుతోంది. ఇలాంటి విపరీత సంఘటనలను నివారించడానికి ప్రతి ఏటా 06 మే రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ నో డైయట్ డే" పాటించడం 1992 నుంచి కొనసాగుతోంది.

అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవం:
శరీర ఆకార స్వీకరణ, వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సంపూర్ణ ఆరోగ్యం పొందడం, నిర్బంధ రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి ప్రపంచ దేశాలు ప్రతి సంవత్సరం మే 6వ తేదీన "అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవం (ఇంటర్నేషనల్ నో డైయట్ డే)"ను పాటిస్తున్నాయి. ఈ వార్షిక ప్రపంచ కార్యక్రమం శరీర సానుకూలత, ఆత్మ ప్రేమ, నిర్బంధ ఆహార సంస్కృతి యొక్క హానికరమైన ప్రభావాలను సవాలు చేయడంపై దృష్టి పెడుతుంది. ఈ రోజు శరీర బరువు వివక్ష, లావు పట్ల భయం, నిర్బంధ ఆహార నియమాల వల్ల కలిగే ప్రమాదాలను ఎత్తి చూపుతుంది. ఇది ఆహార సంబంధిత రుగ్మతలు, బరువు సంబంధిత శస్త్రచికిత్సల బారిన పడిన వారికి నివాళులర్పిస్తుంది. ఈ రోజు వ్యక్తులు తమ శరీరాలను ఉన్నది ఉన్నట్లుగా అభినందించేలా ప్రోత్సహిస్తూ, ఆత్మ ప్రేమను, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

ఇంటర్నేషనల్ నో డైట్ డే చరిత్ర:
అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవాన్ని 1992లో యూకేకు చెందిన స్త్రీవాది మేరీ ఇవాన్స్ యంగ్ స్థాపించారు. ఆమె స్వయంగా అనోరెక్సియాతో పోరాడిన తర్వాత, ప్రమాదకరమైన డైటింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడానికి, శరీర ఆకృతి స్వీకరణను ప్రోత్సహించడానికి దీనిని ప్రారంభించారు. మేరీ ఇవాన్స్ తన స్నేహితులను 'ఆ డైట్‌ను వదిలేయండి' అని ఆహ్వానించారు, దీనికి ప్రజల నుండి, ముఖ్యంగా మహిళల నుండి భారీ ప్రశంసలు లభించాయి. ఇది కఠినమైన డైటింగ్‌కు విరామం ఇవ్వాలని, బరువు గురించి అవమానించడం ఆపమని, ఆరోగ్యకరమైన శరీరాలు అన్ని ఆకారాలు, పరిమాణాలలో ఉంటాయని గుర్తించమని ప్రజలను ప్రోత్సహిస్తుంది. ఇది సామాజిక సౌందర్య ప్రమాణాలను, అవాస్తవ అంచనాలను సవాలు చేయమని కూడా పిలుపును ఇస్తుంది. అంతర్జాతీయ నో డైట్ దినోత్సవ కార్యకలాపాలలో బాడీ-పాజిటివ్ పిక్నిక్‌లు, వర్చువల్ ప్యానెల్ చర్చలు, కళాత్మక వ్యక్తీకరణలు, ఆనందకరమైన ఉద్యమాలు, విద్యాపరమైన చలనచిత్ర ప్రదర్శనలు, మద్దతు కోసం స్వచ్ఛంద సేవ, దుస్తుల మార్పిడి కార్యక్రమాలు, న్యాయవాద లేఖల రచనలు, వ్యాపార సహకారాలు, కృతజ్ఞతా జర్నలింగ్ వంటివి ఉంటాయి.

అంతర్జాతీయ నో డైట్ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత:
అంతర్జాతీయ ఆహార రహిత దినోత్సవాన్ని మీ శరీరాన్ని ఉన్నది ఉన్నట్లుగా, దాని ప్రత్యేకతను, అందాన్ని అంగీకరిస్తూ జరుపుకుంటారు. శారీరక బరువుకు సంబంధించిన హానికరమైన ప్రభావాలు, వైద్య విధానాల గురించి అవగాహన కల్పించడానికి ఈ రోజు ఉద్దేశించబడింది. స్వీయ-అంగీకారానికి చిహ్నంగా, మీకు నచ్చిన, అపరాధ భావన లేని భోజనం లేదా స్నాక్స్‌ను ఆస్వాదించండి. మానసిక - శారీరక ఆరోగ్యంపై డైట్ సంస్కృతి యొక్క హానికరమైన ప్రభావం గురించి మనం అవగాహన పెంచుకోవాలి. ఆహార సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న వారిని గౌరవించడంతో పాటు వారికి మద్దతు ఇవ్వడానికి, ఆహారం మరియు స్వీయ-ప్రతిబింబంతో ఆరోగ్యకరమైన సంబంధాలను ప్రోత్సహించడానికి కూడా ఈ రోజు ఒక వేదికను అందిస్తుంది.

శరీర వైవిధ్యాన్ని గుర్తించి, డైట్ కల్చర్‌పై పోరాడి, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించి, ఆహార సంబంధిత రుగ్మతలపై అవగాహన పెంచుదాం. ఈ రోజు శారీరక ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, శారీరక వ్యాయామాలను కొనసాగించడం, సమతుల్య పోషకాహారం తీసుకోవడం, మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవడం, శరీర రూపానికి సంబంధించిన ఇతర రుగ్మతలపై అవగాహన కల్పించడం నిరంతరం కొనసాగాలి.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# జంతువుల హక్కులను పరిరక్షించాలి

**మే 6...ప్రపంచ పెంపుడు జంతువుల దినోత్సవం.**

**మానవులకు పెంపుడు జంతువులు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తున్నాయి. కొద్దిపాటి ప్రేమాభిమానాలకు, సంరక్షణకే పెంపుడు జంతువులు ప్రేమను, విశ్వాసాన్నీ కలిగి ఉంటాయి. పెంచే వారినే సర్వస్వంగా భావిస్తాయి. అవి మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలుగజేస్తు, కుటుంబంలో సభ్యులుగా మారి చేదోడువాదోడుగా నిలుస్తున్నాయి. ఒక రకంగా వ్యాయామాన్ని, ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తున్నాయి.**

భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం దృవపరుస్తున్నది.
జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాధమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది.

కుక్క, పిల్లి, చేపలు, పక్షులు - ఏవైనా మనం పెంచే మూగజీవాలను ప్రేమగా చూసుకోవాలి. వాటికి అధికంగా స్వేచ్ఛ కల్పించాలి. విశాలమయిన తిరుగాడే సౌకర్యాన్ని కలిగించాలి. పెంపకంలో జాగ్రత్తలు తీసుకుని, వాటిని సంతోషంగా ఉంచుతూ మచ్చిక చేసుకోవాలి. పెంపుడు జంతువుల నివాస, తిరుగాడే స్థలాలను, ఉపయోగించే వస్తువులను శుభ్రపరచాలి. వాటిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
జంతువులకు ముందు జాగ్రత్తగా టీకామందులు వేయించడం, నిర్లక్ష్యం వహించక, క్రమం తప్పకుండా వాటిని పశు వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళడం విధిగా చేయాలి.

జంతువుల పట్ల ప్రేమ, ముద్దు మురిపాలు పరిమితులు దాటరాదు. కానీ వాటితో మూతులు, ముక్కులు నాకించుకోవడం, అస్తమానం అంటిపెట్టుకుని ఉండడం మంచిది కాదు. కొన్నిచోట్ల పెంపుడు జంతువుల పట్ల ఎలా మసలు కోవాలనే అంశంపై ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఇదిలా ఉంటే...మాంసం కోసం, వినోదం కోసం కొందరు అనేక రకాలుగా జంతువులకు కష్ట నష్టాలు కలిగిస్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతు వులను ఉపయోగించుకుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం, అలాగే కొన్నింటిని పోటీల్లో గెలుపు కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువుల పట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిసారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయపరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు.

జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన పలు ప్రాయోజితాలైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, మానవీయ కోణంలో చూడడం, తగిన స్వేచ్ఛ కల్పించడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం, అనివార్యం.

**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**



## జీర్ణాశయ ఆరోగ్యాన్ని పెంచే
# సోంపు గింజలు

**భోజనం చేసిన తర్వాత జీర్ణక్రియ సరిగా ఉండటం ఆరోగ్యానికి చాలా కీలకం. అయితే వేగవంతమైన జీవనశైలి, అసమయ ఆహారాలు తీసుకోవడం, భారీ భోజనాల వల్ల చాలా మందికి గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ సంప్రదాయాల్లో చాలా కాలంగా పాటిస్తున్న ఒక చిన్న అలవాటు భోజనం చేసిన తరువాత సోంపు గింజలు తినడం మళ్లీ ప్రాముఖ్యతను సంతరించుకుంటోంది. భోజనం చేసిన తరువాత సోంపు గింజలను తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వైద్యులు వివరిస్తున్నారు.**

**అనేక ఔషధ గుణాలు..**

సోంపు గింజలు వంటింట్లో సాధారణంగా కనిపించే పదార్థమే అయినప్పటికీ, వీటిలో ఉన్న ఔషధ గుణాలు జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా భోజనం తర్వాత ఒక టీ స్పూన్ సోంపు గింజలు నమలడం ద్వారా గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియను మెరుగుపరచడంలో సోంపు గింజలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఫైబర్‌తోపాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగిన అనెతోల్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కడుపులో గ్యాస్ ఏర్పడటాన్ని తగ్గించి అజీర్ణం, మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే మెటబాలిజాన్ని కూడా మెరుగుపరుస్తాయి.

**నోటి దుర్వాసన, జీర్ణ సమస్యలకు..**

భోజనం తర్వాత నోటి దుర్వాసనను తగ్గించడంలో కూడా సోంపు గింజలు సహజ పరిష్కారంగా పనిచేస్తాయి. వీటిలో ఉన్న సుగంధ తైలాలు బ్యాక్టీరియాను తగ్గించి నోటి దుర్వాసనను నియంత్రిస్తాయి. అదేవిధంగా లాలాజల ఉత్పత్తిని పెంచి నోటిని తాజాగా ఉంచుతాయి. పొట్ట సంబంధిత అసౌకర్యాలను తగ్గించడంలో సోంపు గింజలు సహాయ



పడతాయి. ఇవి పొట్ట కండరాలను సడలించే యాంటీస్పాస్మోడిక్ గుణాలు కలిగి ఉండటంతో పొట్టలో నొప్పి, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తాయి. అలాగే జీర్ణరసాల ఉత్పత్తిని ప్రేరేపించి ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తాయి. ఈ విధంగా భోజనం చేసిన తరువాత సోంపు గింజలు తినడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. ప్రతిరోజూ భోజనం తర్వాత ఒక టీ స్పూన్ సోంపు గింజలు నమలడం వంటి చిన్న అలవాటు జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, జీర్ణాశయ ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. సహజంగా లభించే ఈ సులభమైన పరిష్కారాన్ని రోజువారీ జీవితంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## పిల్లలకు ఆటలు మాత్రమే కాదు
# ఆర్థిక పాఠాలూ అవసరమే

**ప్రస్తుతం పిల్లలు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు. ఇక హాలీడేస్ అంటే ఇళ్లల్లో సందడి మామూలుగా ఉండదు. అయితే నేటి కాలంలో పిల్లలను ఖాళీగా ఉంచకుండా చాలా మంది తల్లిదండ్రులు డ్యాన్స్, సంగీతం, పెయింటింగ్ లేదా కోడింగ్‌లాంటి సమ్మర్ క్యాంప్స్‌కు పంపిస్తుంటారు. అయితే కేవలం యాక్టివిటీస్ మాత్రమే కాకుండా పిల్లలకు తప్పనిసరిగా నేర్పించాల్సిన నైపుణ్యాల్లో ఆర్థిక అక్షరాస్యత అత్యంత కీలకమంటున్నారు ఆర్థిక నిపుణులు. రేపటి తరం ఆర్థికంగా స్థిరపడాలన్నా, మార్కెట్ ఆటుపోట్లను తట్టుకోవాలన్నా.. చిన్నతనం నుంచే డబ్బు విలువపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని మెళకువలు చెబుతున్నారు. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.**





కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం అధ్యయనం ప్రకారం.. 8 సంవత్సరాల నాటికే పిల్లల్లో డబ్బుపై ఒక ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ఆ వయసులో పడే బీజాలే.. వారు పెద్దయ్యాక తీసుకునే ఆర్థిక నిర్ణయాలను శాసిస్తాయి. అందుకే, ఈ వేసవి విరామాన్ని పిల్లలకు మనీ మేనేజ్‌మెంట్ నేర్పించే సువర్ణావకాశంగా మలచుకోవాలంటున్నారు.

అవసరం–కోరిక: స్నేహితుల దగ్గర ఉన్నాయనే కారణంతో పిల్లలు కొత్త వస్తువులు కావాలని మారాం చేయడం సహజం. అయితే ఆ సమయంలో వారికి అవసరం– కోరిక మధ్య ఉన్న తేడాను సున్నితంగా వివరించాలని అంటున్నారు. స్కూల్‌కు వెళ్లడానికి బూట్లు కొనడం అవసరమని, కానీ కేవలం ఉండాలి కాబట్టి, బ్రాండెడ్ బూట్లే కావాలనడం కోరిక అని వారు గ్రహించేలా చెప్పాలట. సూపర్ మార్కెట్‌కు వెళ్లినప్పుడు బడ్జెట్ పరిమితులను వివరిస్తూ వస్తువులను ఎంచుకోవడం చూపిస్తే.. వారిలో విచక్షణతో ఖర్చు చేసే జ్ఞానం అలవడుతుందని చెబుతున్నారు.

పొదుపు తప్పనిసరి: మట్టి హుండీలు లేదా కిడ్డీ బ్యాంకులు డబ్బు దాచుకునే అలవాటుకు అత్యుత్తమ సాధనాలు. అందుకే వారికిచ్చే పాకెట్ మనీ నుంచి కొంత మొత్తాన్ని పక్కనపెట్టడం నేర్పించాలని.. ఇలా క్రమక్రమంగా చేస్తుంటే పొదుపు గురించి ఓ అవగాహన వస్తుందని అంటున్నారు. అంతేకాకుండా ఏదైనా ఖరీదైన బొమ్మ కావాలని అడిగితే వెంటనే కొనివ్వకుండా.. "సగం డబ్బు నీ కిడ్డీ బ్యాంకు నుంచి తీద్దాం. మిగిలిన సగం నేను ఇస్తాను" అని చెప్పండి. దీనివల్ల ఆ వస్తువు విలువ కూడా వారికి తెలిసొస్తుందని చెబుతున్నారు.

బ్యాంకింగ్ పాఠాలు: నేటి తరం పిల్లలు పుట్టుకతోనే టెక్నాలజీకి అలవాటుపడుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే లాంటి యాప్‌లతో చేసే పేమెంట్లను వారు గమనిస్తూనే ఉంటారు. అయితే ఫోన్‌లోకి డబ్బు ఎలా వస్తుంది? ఎక్కడ దాచుకోవచ్చు? అనే విషయాలను విడమర్చి చెప్పాలి. కనీసం ఒక్కసారైనా బ్యాంకుకు తీసుకెళ్లి డబ్బులు డిపాజిట్ చేయడం, ఏటీఎం నుంచి డ్రా చేయడం, పాస్‌బుక్ ఎంట్రీలు చూపించాలి. మైనర్ల కోసం బ్యాంకులు అందిస్తున్న ప్రత్యేక సేవింగ్స్ ఖాతాలు తెరిపిస్తే వారిలో బాధ్యత పెరుగుతుందని వివరిస్తున్నారు.

పెట్టుబడి పాఠం: డబ్బును పొదుపు చేయడంతో పాటే.. దాన్ని వృద్ధి చేసే విధానమూ నేర్పించాలని అంటున్నారు. స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ గురించి వారి వయసుకు తగ్గట్లుగా ఉదాహరణలతో వివరించాలని అంటున్నారు. వారు ఇష్టంగా తినే చాక్లెట్లు, వాడే వస్తువులను తయారు చేసే కంపెనీల గురించి చెబుతూ.. వాటిలో పెట్టుబడి పెడితే లాభాలు ఎలా వస్తాయో ఆసక్తికరంగా చెప్పాలి. ముఖ్యంగా చక్రవడ్డీ (కాంపౌండింగ్) లోని మహిమను వివరిస్తే.. చిన్న వయసులోనే పెట్టుబడుల పట్ల ఆకర్షితులవుతారని చెబుతున్నారు.

శ్రమతోటే ప్రతిఫలం: డబ్బులు ఊరికే రావు అని పిల్లలకు స్పష్టం చేయడం అత్యవసరం. ఇంట్లో చిన్న చిన్న పనుల్లో సాయం చేసినప్పుడు వారికి బహుమతులు ఇవ్వాలి. ఆ పని చేస్తే ఇస్తాం అని చెప్పకూడదు. చేసిన తర్వాత ఇవ్వడం మంచి అలవాటు. శ్రమకు, సంపాదనకు మధ్య ఉన్న బంధాన్ని ఈ ప్రక్రియ వారిలో బలంగా నాటుతుంది.

తల్లిదండ్రులదే కీలకపాత్ర: చాలా మంది తల్లిదండ్రులు తమ ఆర్థిక ఇబ్బందులను పిల్లల ముందు ప్రస్తావించేందుకు సంకోచిస్తుంటారు. కానీ కుటుంబ బడ్జెట్ రూపకల్పనలో పిల్లలను సైతం భాగస్వాములను చేస్తే.. వారిలో బాధ్యతాయుత ప్రవర్తన అలవడుతుందని నిపుణులు అంటున్నారు. ఈ వేసవిలో కోడింగ్ క్లాసులతో పాటు, ఇలాంటి ఆచరణాత్మక ఆర్థిక పాఠాలు నేర్పించడం వల్ల వారు భవిష్యత్తులో అప్పుల ఊబిలో పడకుండా, ఆర్థిక స్వతంత్రులుగా మారే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

**ఇలా చేయొచ్చు:**

ఆటల ద్వారా: మోనోపోలీ, బిజినెస్ లాంటి బోర్డ్ గేమ్స్ ఆడించడం వల్ల ఆటపాటల్లోనే వ్యాపార నైపుణ్యాలను నేర్పొచ్చంటున్నారు.

లక్ష్య నిర్దేశం: స్వల్పకాలిక (కొత్త బొమ్మ కోసం), దీర్ఘకాలిక (సైకిల్ కోసం) పొదుపు లక్ష్యాలను పిల్లలే నిర్ణయించుకునేలా ప్రోత్సహించాలని చెబుతున్నారు.

మీరే ఆదర్శం: పిల్లలు తల్లిదండ్రులను చూసే నేర్చుకుంటారు. కాబట్టి పారదర్శకత పాటిస్తూ, ఖర్చుల విషయంలో మీరే వారికి ఆదర్శంగా నిలవాలని స్పష్టం చేస్తున్నారు.



# లివర్ ఆరోగ్యాన్ని పెంచే యోగాసనాలు

సాధారణంగా లివర్ ఆరోగ్యం గురించి మాట్లాడినప్పుడు ఆహారంపై ఎక్కువ దృష్టి పెడతారు. అయితే నిత్య జీవితంలో చేసే చిన్న వ్యాయామం కూడా లివర్‌ను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. లివర్ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో ఒకటి. ఇది విషపదార్థాలను తొలగించడం, పోషకాలను ప్రాసెస్ చేయడం, మెటబాలిజాన్ని నియంత్రించడం, జీర్ణక్రియకు సహాయం చేయడం వంటి అనేక పనులు చేస్తుంది. కానీ ఎక్కువసేపు కూర్చోవడం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక కేలరీల ఆహారం తీసుకోవడం వల్ల నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు యువతలో కూడా పెరుగుతున్నాయి. నిపుణుల ప్రకారం, వారానికి కనీసం 150–200 నిమిషాల మోస్తరు వ్యాయామం చేయడం లివర్ ఆరోగ్యానికి అవసరం. అయితే గంటల పాటు జిమ్‌లో గడపాల్సిన అవసరం లేదు. ప్రతిరోజూ కేవలం 5–10 నిమిషాల చిన్న వ్యాయామం కూడా మంచి ఫలితాలు ఇస్తుంది. ఈ క్రమంలో సులభంగా చేయగల చిన్న వ్యాయామాల రొటీన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మొదటగా 2–3 నిమిషాల పాటు వేగంగా నడవడం (బ్రిస్క్ వాకింగ్) చేయాలి. ఇది రక్తప్రసరణను మెరుగుపరచి మెటబాలిజాన్ని ప్రారంభిస్తుంది. దీని వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం తగ్గుతుంది. తర్వాత 1–2 నిమిషాల పాటు కపాలభాతి ప్రాణాయామం చేయాలి. వేగంగా శ్వాసను బయటకు వదిలే ఈ శ్వాస వ్యాయామం పొట్టలోని అవయవాలను ఉత్తేజపరుస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ మెరుగవడం, డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు సహాయం జరుగుతుంది.





# నష్టాల్లో ముగిసిన సూచీలు

## పశ్చిమాసియాలో పరిస్థితులే కారణం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణ వాతావరణం నెలకొనడంతో నిన్నటి లాభాలకు గండిపడింది. 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' కింద రెండు నౌకలను హర్మూజ్ జలసంధి దాటించినట్లు అమెరికా ప్రకటించింది. ఈ క్రమంలోనే తమ జలాల్లోకి ప్రవేశించిన అమెరికా నౌకపై దాడి చేసినట్లు ఇరాన్, తమ కార్యకలాపాలు అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఇరాన్ చిన్న నౌకలను ధ్వంసం చేసినట్లు అమెరికా ప్రకటించడం ఆందోళనకు కారణమైంది. మరోవైపు యూఏఈ లక్ష్యంగా ఇరాన్ దాడి చేయడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ముఖ్యంగా బ్యాంక్, రియాలిటీ, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

సెన్సెక్స్ ఉదయం 77,103.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,269.40) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,515.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 251.61 పాయింట్ల నష్టంతో 77,017.79 వద్ద ముగిసింది. నిఫ్టీ 86.50 పాయింట్ల నష్టంతో 24,032 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి



మారకం విలువ 95.25గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 112 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4552 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## సిరామిక్స్ దగ్గర నుంచి ఎఫ్ఎమ్‌సీజీ వరకు...
# పలు రంగాలకు చమురు పోటు

**పలు ఉత్పత్తుల తయారీలో ముడి సరకుగా వాడటం వల్లే..**

ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైన పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమై రెండు నెలలు మించింది. సంప్రదింపులు కొనసాగుతున్నా.. ఉద్రిక్తతల తగ్గుముఖంపై అనిశ్చితి వీడటం లేదు. హర్మూజ్ జలసంధి మీదుగా సరకు రవాణాకు అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఫలితంగా రవాణా, బీమా వ్యయాలు.. సరఫరా సమయాలు పెరుగుతున్నాయి. ముడిచమురు కొరత వల్ల సిరామిక్స్ దగ్గర నుంచి ఎఫ్ఎమ్‌సీజీ వరకు దాదాపు 30 రంగాలపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం పడుతోంది. ఎరువుల ఉత్పత్తి క్షీణిస్తోంది. విమానయాన సంస్థల ఆదాయాలు–మార్జిన్లు పడిపోతున్నాయి.

మనదేశ ముడి చమురు దిగుమతుల్లో 35–50% హర్మూజ్ జలసంధి మీదుగానే వస్తుంటాయి. గల్ఫ్ దేశాల నుంచి ఇవి దిగుమతి అయ్యేవి. యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా నుంచి ముడి చమురు సరఫరా మళ్లీ పెంచుకున్నా, రవాణాకు అధిక సమయం, వ్యయాలు అవుతున్నాయి. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు ఏప్రిల్ మధ్యలో మెరుగుపడినా, యుద్ధానికి ముందు స్థాయిల్లో 14 శాతమే కావడం ఆందోళన కలిగించే అంశం. ఇంధన వనరుగానే కాకుండా... 6,000కి పైగా తయారీ ఉత్పత్తులకు కీలక ముడి పదార్థంగా ముడి చమురు ఉపయోగపడుతోంది. ఆరోగ్య సంరక్షణ (వైద్య ఉత్పత్తుల పాలీమర్లు), వ్యవసాయం (నైట్రోజన్ ఆధారిత ఎరువులు), సాంకేతికత (సర్క్యూట్ బోర్డు రెసిన్‌లు) వంటి పలు రంగాలు పెట్రోలియం ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నాయి. ఇంధన సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే, చాలా రంగాల ఆదాయాలు ప్రమాదంలో పడొచ్చు. సరఫరా అంతరాయాలతో వ్యయాలు పెరిగితే.. ద్రవ్యోల్బణం అధికమై, గిరాకీపై ప్రతికూల ప్రభావం పడొచ్చు. ఆర్థిక వృద్ధి నెమ్మదించేందుకూ ఇది దారి తీయొచ్చు.



**ధరలు పెరుగుతూ.. గిరాకీ తగ్గుతూ**

సహజవాయువు కొరత కారణంగా దేశీయంగా మార్చిలో ఎరువుల ఉత్పత్తి 2025 ఇదేనెలతో పోలిస్తే 24.6% క్షీణించిందని క్రిసిల్ విశ్లేషించింది. ఈ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ జోక్యం అవసరమని సూచించింది.

కొన్ని దేశాల గగనతల ఆంక్షలు, విమాన ఇంధన ధరల పెరుగుదల, రూపాయి విలువ క్షీణత వల్ల విమానయాన సంస్థల నిర్వహణ మార్జిన్‌లు మూడింట ఒక వంతు కంటే ఎక్కువగా తగ్గే అవకాశం ఉంది.

ఎల్ఎన్‌జీ, ప్రొపేన్‌పై అధికంగా ఆధారపడిన సిరామిక్స్ రంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ రంగ ఆదాయాల్లో 35%, నిర్వహణ మార్జిన్‌లో 50% క్షీణత ఉండొచ్చన్నది అంచనా.

ఇంధన, ముడి సరకు ఖర్చులు పెరగడం వల్ల సిమెంట్, పాలీవినైల్ క్లోరైడ్ పైపులు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు లాభాల మార్జిన్లలో ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. సిమెంటు తయారీ కంపెనీల వ్యయాల్లో 15% వాటా ఇంధనానిదే. బొగ్గు వైపునకు మారడం, బలమైన బ్యాలెన్స్ షీట్లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ ప్రభావాన్ని సిమెంటు కంపెనీలు కొంత తగ్గించుకోవచ్చు.

ద్రవ్యోల్బణం అధికమై, వినియోగదారు సెంటిమెంటు బలహీనపడితే ఎఫ్ఎమ్‌సీజీ, ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం ఉండొచ్చు.

తగ్గిన డిమాండు, పెరుగుతున్న ఖర్చులకు తగ్గట్లుగా స్థిరాస్తి, ఆతిథ్య రంగాలు సిద్ధమవుతున్నాయి. రంగులు, రహదారులు, వంతెనలు, టైర్ల పరిశ్రమల ఆదాయాలూ నెమ్మదించొచ్చు. ఈ పరిశ్రమల్లో తారు, సింథటిక్ రబ్బరు వంటి ముడి చమురుతో ముడిపడిన ముడి పదార్థాలు వాడుతుండటం, రిఫ్రిజిరెంట్ వాయువుల ధర పెరగడం ఇందుకు కారణం.

**భారత్‌కు సవాలే...**

ప్రత్యామ్నాయ విపణుల నుంచి ఇంధన సరఫరా పెంచుకునేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా.. చమురు ధర అధికంగా ఉండటం, సరకు రవాణా సమయం – వ్యయాలు– బీమా ఛార్జీలు పెరగడం, ఆయిల్ ట్యాంకర్ల కొరత, షిప్పింగ్, ట్రాన్సిట్ వ్యయాలు అధికం కావడం ఇబ్బంది పెడుతున్నాయి. ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను ప్రభుత్వం పెంచనందున.. ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలే నష్టపోతున్నాయి. ఇకపై కొంత భారాన్ని ప్రజలకు మళ్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెట్రో ధరల పెంపును కొట్టేయలేమని కేంద్రప్రభుత్వం సంకేతాలు ఇవ్వడం ఇందుకు నిదర్శనం. పెట్రో ధరలు పెరిగితే, ఆ ప్రభావం సేవలు – ఉత్పత్తుల ధరల రూపేణ వినియోగదార్లకు అదనపు భారం అవుతుంది.

# ప్రజల్ని అప్రమత్తం చేసిన ఆర్‌బీఐ

**రుణాలను మాఫీ చేయిస్తామంటూ జరిగే తప్పుడు ప్రచారాలతో జాగ్రత్తని, ఇలాంటి మోసపూరిత హామీలను ఇచ్చే వ్యక్తులు, సంస్థలకు దూరంగా ఉండాలని ప్రజలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అప్రమత్తం చేసింది.**

నేరుగా లేదా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అమాయకులను అక్రమార్కులు మోసం చేస్తున్నారని విడుదల చేసిన ఓ ప్రకటనలో సెంట్రల్ బ్యాంక్ ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది. 2023 డిసెంబర్‌లోనూ ఇదే తరహా సూచనను చేశామని గుర్తుచేసిన ఆర్బీఐ.. ఈ మోసాల వల్ల సాధారణ ప్రజానీకమేగాక, సక్రమంగా నడుస్తున్న దేశీయ రుణ వ్యవస్థ సైతం గాడితప్పే ప్రమాదం ఉందన్నది. ఆర్థిక సంస్థల్ని అస్థిరపర్చడమేగాక, డిపాజిటర్ల ప్రయోజనాలూ దెబ్బతింటాయన్నది. కాబట్టి బ్యాంకులు/బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) ల్లోని బకాయిలను రద్దు చేయిస్తామన్న మాటల్ని నమ్మి, ఎవరికి ఏవిధంగానూ సొమ్మును చెల్లించరాదని ప్రజలను కోరింది. అలాగే మాయ





మాటలతో ఇలాంటి మోసాలకు తెగబడితే చట్టప్రకారం కఠిన శిక్షలకు అర్హులవుతారని కేటుగాళ్లను రిజర్వ్ బ్యాంక్ ఈ సందర్భంగా హెచ్చరించింది.

## ఏఐ రిస్క్‌లపై సెబీ అలర్ట్

భారత క్యాపిటల్ మార్కెట్లలో వేగంగా పెరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ) వినియోగం కొత్త అవకాశాలను అందించడమే కాకుండా, కొత్త ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ త్వరలో ఏఐ ఆధారిత రిస్క్‌లపై మార్కెట్ మధ్యవర్తులకు అడ్వైజరీని విడుదల చేస్తుందని ఛైర్మన్ తుహిన్ కాంత్ పాండే తెలిపారు.





ఐఎంసీ క్యాపిటల్ మార్కెట్స్ కాన్ఫరెన్స్ 2026లో మాట్లాడిన ఆయన.. తదుపరి తరం ఏఐ మోడళ్లు మార్కెట్ వ్యవస్థను సమర్థవంతంగా మారుస్తున్నప్పటికీ, అవి వ్యవస్థలోని బలహీనతలను వేగంగా గుర్తించి దుర్వినియోగం చేసే అవకాశాన్ని కూడా పెంచుతున్నాయి. ముఖ్యంగా పరస్పరం అనుసంధానంగా ఉన్న మార్కెట్లలో, ఒక చిన్న లోపం కూడా చైన్ రియాక్షన్‌లా వ్యాప్తి చెంది పెద్ద నష్టాలకు దారితీయవచ్చని తుహిన్ కాంత పాండే అభిప్రాయపడ్డారు. కాబట్టి నియంత్రణపైనే కాకుండా, 'ప్రొయాక్టివ్ రెడీనెస్'పై సెబీ దృష్టి సారిస్తోందన్నారు. మార్కెట్ మధ్యవర్తులు, సంస్థలు తమ సైబర్ భద్రతను ముందుగానే బలోపేతం చేయాలి, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేయాలి, లోపాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

## వారసురాలిని ప్రకటించిన మజుందార్ షా

### మేనకోడలికి బయోకాన్ బాధ్యతలు

బయోటెక్నాలజీ సంస్థ బయోకాన్ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ మజుందార్ షా వారసత్వ ప్రణాళికను ప్రకటించారు. మజుందార్ షా తర్వాత బయోకాన్ సంస్థను ఆమె మేనకోడలు క్లెయిర్ మజుందార్ నడిపించనున్నారు. ఈ మేరకు ఫార్చ్యూన్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మజుందార్ షా ఈ అంశంపై మాట్లాడారు. నాలుగు దశాబ్దాల క్రితం బయోకాన్‌ను నెలకొల్పిన మజుందార్ షాకు పిల్లలు లేరు. దీంతో తన కంపెనీని తదుపరి దశకు తీసుకెళ్లే బాధ్యతను తన మేనకోడలు క్లెయిర్ మజుందార్‌కు అప్పగించనున్నట్లు తెలిపారు. కంపెనీని విజయవంతంగా నడిపే సత్తా ఆమెకున్నట్లు విశ్వాసం వ్యక్తంచేశారు.

వారసత్వ ప్రణాళికను ప్రకటించినప్పటికీ.. మరికొన్నాళ్ల పాటు బయోకాన్ ఛైర్‌పర్సన్‌గా ఉండనున్నట్లు మజుందార్ షా వెల్లడించారు. వారసురాలి ప్రకటన గురించి మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆమె ఎక్స్‌వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ఇప్పటికిప్పుడు బయోకాన్ బాధ్యతల నుంచి వైదొలిగే ఉద్దేశమేదీ లేదని అందులో తెలిపారు. దశలవారీగా క్లెయిర్‌కు బాధ్యతల అప్పగిస్తానని అందులో పేర్కొన్నారు.



ప్రస్తుతం క్లెయిర్ మజుందార్ షా నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ అయిన బైకారా థెరప్యూటిక్స్‌కు సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఎంఐటీ, సాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పొందారు. క్యాన్సర్ బయాలజీలో పీహెచ్‌డీ చేశారు.

## పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**సీఐ ప్రశాంత్**



**అల్వాల్, మే 5 (నినాదం):** పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ పేర్కొన్నారు. అల్వాల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్వాల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వరులు మత పెద్దలు మరియు స్థానిక ప్రముఖులు హాజరైనారు .ఈ సందర్భంగా సిఐ ప్రశాంత్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రశాంతంగా శాంతియుతంగా ,ఐకమత్యంగా జరుపుకోవాలని తెలిపారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సమస్యలను రాకుండా చూసుకోవాలని ఇలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశాలు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు .డిసి భోగేశ్వరులు మాట్లాడుతూ వారికి కావలసిన సదుపాయాలను కల్పించే బాధ్యత జిహెచ్ఎంసి మీద ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఐ వీరబాబు , అడ్మిన్ ఎస్సై తరుణ్, ఎస్సై రాఘవేంద్ర రెడ్డి, ఎస్సై దేవేందర్, ఎస్సై మల్లేష్, ఎస్సై తులసి రామ్ ,ఎస్ఐ గీత మరియు మత పెద్దలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు జోష్ కలిగించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు



**మిరుదొడ్డి, మే 5 (నినాదం):** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం రోజున మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల కళ్యాణ మండలంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు తోట.కమలాకర్ రెడ్డి అత్యధిక ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నూతన జోష్ కలిగించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ మండలంలో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థినికి 5000 రూపాయలు రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థినికి 2000 రూపాయలు, మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థినికి వెయ్యి రూపాయలు బహుమానంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి అత్యధిక ప్రతిభను కనబరచడం హర్షణీయమని అన్నారు. ఏ సమయంలోనైనా ఏ విద్యార్థికైనా ఎలాంటి సహాయమైనా బీద, గ్రామీణ విద్యార్థుల కోసం తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. తల్లి దండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు కృషి చేస్తూ అన్ని రంగాలలో రాణించాలని సూచించారు.

## రైతులు ఉద్యాన పంటలు అధికంగా పండించాలి

**రైతు వారోత్సవాల్లో అధికారుల సూచన**



**వికారాబాద్, మే 5 (నినాదం):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా రైతు వారోత్సవాల సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం. ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధ్యక్షతన ఉద్యాన పంటల సాగు ఆయిల్ ఫామ్ సాగు అనే అంశాలపై రైతు అవగాహనా సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారిక పిలుపు మేరకు కార్యక్రమంలో పాల్గొన్న వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల. శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ త్వరలో వికారాబాద్లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారని అన్నారు. ఆయిల్ పామ్ రైతులకు మార్కెటింగ్ కు ఇది చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా ఆర్గానిక్ ఉత్పత్తుల సమాచారం తెలుసుకోవడానికి టిజీ అర్గానిక్ అప్ అందుబాటులో తీసుకొచ్చారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా భూసార పరీక్ష కేంద్రాన్ని కూడా అతి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని రైతులు తమ భూసారాన్ని తెలుసుకునేందుకు విలుగా మట్టి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, పండ్లు, పూలు అధికంగా పండించి రైతులు మంచి లాభలు గడించాలని ప్రభుత్వం అందించే సబ్సిడీ ద్వారా స్పింక్లర్లు, డ్రిప్, వ్యవసాయ పనిముట్లు ఉపయోగిం చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటచారి, మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్ రెడ్డి, డిఏవో రాజారత్నం, హార్టికల్చర్ అధికారులు సునీత, సత్తార్, యమున, ఆంజనేయులు రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# పారదర్శకతతో సంక్షేమ పథకాల అమలు

**అభివృద్ధి సంక్షేమమే మా తొలి ప్రాధాన్యత**

**పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**





**పటాన్చెరు, మే 05(నినాదం):** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. రామచంద్రాపురం, పటాన్చెరు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమన్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అని విప్లవాత్మక పథకాన్ని పెట్టారని గుర్తు చేశారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గీతం సైన్స్ కోర్సుల అడ్మిషన్ల కోసం మే 17న ప్రవేశ పరీక్ష

**పటాన్చెరు, మే 05 (నినాదం):** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ సైన్స్ యూజీ, పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం మే 17న గీతం అడ్మిషన్ టెస్ట్ (గాట్-2026, మూడో దశ)ను నిర్వహించనుంది. ఆసక్తి గల అభ్యర్థులు మే 14వ తేదీలోగా విశ్వవిద్యాలయ అధికారక పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను ఆన్ లైన్లో సమర్పించవచ్చని స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రెజా మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. యూజీసీ గుర్తింపుతో పాటు నాక్ ఏంం గ్రేడ్ తో అక్రిడిటేషన్ పొందిన స్కూల్ ఆఫ్ సైన్స్ అంతర్ విభాగ విద్య, అధునాతన పరిశోధనలకు ఒక అగ్రగామి కేంద్రంగా ఆవిర్భవించిందన్నారు. ప్రపంచవ్యాప్త అనుభవం కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకుల మద్దతుతో, ఆవిష్కరణ, డీప్-టెక్ పరిశోధన, వ్యవస్థాపకతను ప్రోత్సహించే ఒక చైతన్యవంతమైన విద్య వాతావరణాన్ని స్కూల్ ఆఫ్ సైన్స్ అందిస్తోందని తెలిపారు. ఈ స్కూల్ యూజీ స్థాయిలో నాలుగు సంవత్సరాల నిడివి గల బీఎస్సీ కోర్సులను అందిస్తోందన్నారు. బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ లో (ఆనర్స్) కోర్సులతో పాటు, మేనేజ్ మెంట్, సోషల్ సైన్సెస్, డేటా సైన్స్, క్వాంటం కంప్యూటింగ్ లో ఫ్లెక్సిబుల్ మైనర్ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు రెండు ప్రధాన వృత్తిపరమైన కోర్సులను కూడా అందజేస్తున్నామన్నారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, కాగ్నిటివ్ సిస్టమ్స్ (మూడేళ్ల కోర్సు) కంప్యూటింగ్, కాగ్నిటివ్ సైన్సెస్ ను మిళితం చేసే బహుళ విషయక కోర్సని, ఇది కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో పరిశ్రమ డిమాండ్ కు అనుగుణంగా రూపొందించినట్లు తెలిపారు. ఐదేళ్ల నిడివి గల బి-ఆప్టోమెట్రీ కోర్సును ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ సహకారంతో అందిస్తున్నామని, బలమైన క్లినికల్ శిక్షణ, ఉపాధి అవకాశాలతో నైపుణ్యం కలిగిన నేత్ర సంరక్షణ నిపుణులను తయారు చేస్తున్నామన్నారు.

ఇక, పీజీ స్థాయిలో, బయె టెక్నాలజీ, కెమిస్ట్రీ (అనలీటికల్, ఆర్గానిక్, ఫార్మాస్యూటికల్ స్పెషలైజేషన్లు), డేటా సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫిజిక్స్ (మెటీరియల్ సైన్స్)లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులను అందిస్తున్నట్టు తెలిపారు. ఫెలోషిప్ మద్దతుతో కూడిన ఫుల్-టైమ్ పీహెచ్.డీ. కోర్సులు కూడా పలు విభాగాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. భవిష్యత్తు-కేంద్రీకృత పాఠ్యప్రణాళికను డాక్టర్ రెజా వివరిస్తూ, ప్రపంచ పారిశ్రామిక అవసరాలను తీర్చడానికి డేటా సైన్స్, క్వాంటం సైన్స్ వంటి అధునాతన రంగా లను ఆయా కోర్సులలో పొందుపరిచామని తెలిపారు. విద్యార్థులు ప్రారంభ దశలోనే పరిశోధన అనుభవాన్ని, రెండో ఏడాది నుంచే ఇంటర్న్ షిప్, ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులతో ముఖాముఖితో ప్రయోజనం పొందుతారన్నారు. ఐఐటీ, సీఎస్ఐఆర్, బాబా అణు పరిశోధనా సంస్థ, డీఆర్డీవో వంటి ప్రముఖ సంస్థలతో పాటు డాక్టర్ రెడ్డీస్, టీసీఎస్ వంటి పారిశ్రామిక దిగ్గజాలతో బలమైన సహకారాలను కొనసాగిస్తూ, పటిష్టమైన పరిశోధనా అవకాశాలను, ప్రాంగణ నియామకాలను అందిస్తున్నట్టు ఆయన వివరించారు. అలాగే ప్రతిభావంతులైన విద్యార్థులు ఉపకార వేతనాల (స్కాలర్ షిప్పులు)ను అందిస్తున్నా మన్నారు.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటయ్యే స్కోరుతో నేరుగా మే 17న వ్యక్తిగత ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం www.gitam.eduను సందర్శించాలని లేదా హెల్ప్ లైన్ 888 498 4000ను సంప్రదించాలని డాక్టర్ రెజా సూచించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండుగలు జరుపుకోవాలి

**• జవహర్నగర్ ఎస్హెచ్ఓ సైదులు**



**జవహర్నగర్, మే 5 (నినాదం):** శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండుగలు... వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని ప్రజలు శాంతియుతంగా మెలగాలని కోరుతూ జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు ఆధ్వర్యంలో మంగళవారం ముస్లిం హిందూ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ పండుగల మాటున అల్లర్లు సృష్టించాలని చూస్తే సహించేది లేదని ఎంతటి వారినైనా వదిలి పెట్టబోమని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఘర్షణలు జరిగే ఆస్కారం ఉంటే ముందే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సోదర భావంతో ప్రజలు పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు ఇద్రిస్ అలీ, మౌనిక, నాయకులు ఫరూక్, కాలేశా, అహ్మద్ పాషా, పాషా మియా, సంతోష్, నవీన్, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

**ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి**

**ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే**





**మిరుదొడ్డి, మే 5 (నినాదం):** మార్చి - 2026 లో పదవతరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల కళ్యాణ మండలంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. 10వ తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి అద్భుతమైన ఫలితాలు సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నా, పట్టుదలతో చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదని, సరైన మౌలిక వసతులు, సదుపాయాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అయినప్పటికీ విద్యార్థులు ఆ పరిస్థితులను అధిగమించి తమ ప్రతిభను నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. విద్య ఒక్కటే కాదు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అన్ని రంగాల్లో కూడా రాణించి సమగ్ర అభివృద్ధి సాధించాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినా, మార్కులు తక్కువ వచ్చినా నిరుత్సాహపడవద్దని, ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ధైర్యంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. జీవితం ఒక్క పరీక్షతో నిర్ణయించబడదని, మరిన్ని అవకాశాలు ముందున్నాయని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని, సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి , మండల విద్యాధికారి ప్రవీణ్, గ్రామ సర్పంచ్ ఎలుముల మహేశ్వరీ, దేవరాజు,నైపుణ్య ఆర్గనైజేషన్ అధ్యక్షులు మొగుళ్ళ ఇలయ్య, ప్రొఫెసర్ పెద్ది రాజు, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు తోట .కమలాకర్ రెడ్డి తో పాటు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయమే దుబ్బాక ప్రజల జీవనాధారం

**పంటల వైవిధ్యంతోనే**

**రైతుల భవిష్యత్ భద్రత**

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**



**దుబ్బాక మే 5 (నినాదం):** దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలో ఉన్న జయ విజయ ఫంక్షన్ హాల్లో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై రైతులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుబ్బాక నియోజకవర్గంలో పెద్ద పరిశ్రమలు లేకపోవడంతో ప్రజల ప్రధాన ఆదాయం వ్యవసాయమేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా కాలువలలో నీటి లభ్యత పెరగడం వల్ల భూమిలో తేమ శాతం మెరుగైందని, దీని కారణంగా గతంలో సాధ్యం కాని ఆయిల్ పామ్ వంటి పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని అవలంబించాలని సూచిస్తూ, ఆయిల్ పామ్, మొక్కజొన్న, సన్ఫ్లవర్, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. వరిని "ఈజీ క్రాప్"గా భావించి వరుసగా సాగు చేయడం వల్ల భూమి సారం తగ్గిపోతుందని, ఎరువుల వినియోగం అధికమవుతోందని హెచ్చరించారు. అలాగే అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, పంజాబ్ రాష్ట్ర పరిస్థితులు దీనికి ఉదాహరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అయినా అన్ని కాలాల్లో అన్ని పంటలను కొనుగోలు చేయడం సాధ్యం కాదని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. భవిష్యత్తులో చట్ట మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఒకే పంటపై ఆధారపడటం ప్రమాదకరమని తెలిపారు. భూమి సారం పూర్తిగా తగ్గిపోకముందే రైతులు మేల్కొని, పంటల వైవిధ్యాన్ని అవలంబించడం ద్వారా తమ భవిష్యత్తును భద్రపరుచుకోవాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## మాదారంలో భక్తి శ్రద్ధలతో బీరప్పకు పూజలు



**వికారాబాద్, మే 5(నినాదం):** జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం మాదారంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో మంగళవారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామం బీరప్ప నామస్మరనతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్రెడ్డి, యువజన నాయకులు ప్రసాద్ కుమార్, సర్పంచ్ లు నర్సింహారెడ్డి, నర్సింలు, నాయకులు లక్ష్మణ్, మల్లేష్, సంజీవ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పరిగి ఎమ్మెల్యేను కలిసిన సిఐ కొండల్ రెడ్డి



**వికారాబాద్, మే 5(నినాదం):** హైదరాబాద్లోని పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి నివాసంలో పరిగికి బదిలీ పై వచ్చిన నూతన సిఐ కొండల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొండల్ రెడ్డి ని ఎమ్మెల్యే సాధారంగా ఆహ్వానించారు. అదేవిధంగా పరిగి నియోజకవర్గంలో శాంతి భద్రతలు పరిరక్షణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషించాలని సూచించారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్**



**మల్కాజిగిరి, మే 5 (నినాదం):** డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అన్నారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని దుర్గా నగర్ 3.5 లక్షల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్య మూర్తి, బాబు సత్యనారాయణ, సంపత్ రావు, కాలనీ అధ్యక్షులు నరసింహ రెడ్డి, చారి, కరణం గోపి, రత్నభూషణ్ రావు, కిషోర్,సచిన్, ప్రసాద్, ఎస్ఎఫ్ఏ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, మే 5(నినాదం): వరి**ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో సమావేశము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని, రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు , గొనె సంచులు అందుబాటులో ఉంచాలని ,ఇతరమౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, ఆలస్యం లేకుండా, రైతులు వేచి చూసే పరిస్థితి రాకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి,డి ఆర్ డి ఎ శ్రీనివాస్, డి ఎస్ ఓ సుదర్శన్, డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ,వ్యవసాయ అధికారి రాజా రత్నం, మార్కెటింగ్ ఎం డి రియాజ్,మార్క్ఫెడ్ రేఖ, డిసిఓ నాగార్జున సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలు.. పేదల, బాటసారుల దప్పికకు కల్పవృక్షాలు



**జవహర్ నగర్, మే 5 (నినాదం);** ప్రజలకు వేసవికాలంలో దాహార్తిని తీర్చేందుకు ఈసీఐఎల్ లోని శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా రహదారి బాటసారుల దాహార్తిని తీరుస్తూ ప్రజల అభిమానుల ఆదర అభిమానాన్ని చూరగొంటుంది. ఈ సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని టెర్మినల్ వద్ద మంగళవారం శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాటసారులకు అన్నపూర్ణా, సుదర్శన్ రావు తదితరుల ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యుడు సుదర్శన్ రావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా శ్రీ సత్యసాయి సేవాసమితి ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా నిరాడంబరంగా ప్రజల దాహార్తిని తీర్చడమే అంతిమ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు . వేసవికాలం వచ్చిందంటే చాలు సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై చలివేంద్రాలను ఏర్పాటు చేసి త్రాగునీరు మజ్జిగ ఇతర దాహార్తి పానీయాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, సుభాషిని ,శేషగిరిరావు, కేబుల్ ఆపరేటర్ రమేష్ తదితరుల ఆధ్వర్యంలో ఈ పుణ్యకార్యము మూడు నెలలుగా యధావిధిగా జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు దామరపల్లి నర్సింహారెడ్డి, పందిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అందరి ఆమోదంతో మట్టి రోడ్డు నిర్మాణం

**• ఎంపీడివోకు వినతి**



**వికారాబాద్, మే 5(నినాదం ):** జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం చిట్టిగిద్ద గ్రామానికి సంబంధించిన గ్రామస్తులు కొందరు మంగళవారం ఎంపీడీవో అనురాధ ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని గ్రామం నుండి చించల్ పేట గ్రామం వైపు వెళ్ళే ఈ రోడ్డు నుండి నిత్యం పొలం పనులకు రాకపోకలు సాగించే రైతులు ఇటీవల ఉన్న మట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించామని పేర్కొన్నారు. అయితే కొందరు ఈ విషయాన్ని రాద్ధాంతం చేయడం ఇతర రైతులును రెచ్చగొట్టి దారి లేకుండా చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ రోడ్డు రైతులకే కాకుండా ఏడు గ్రామాలకు రాకపోకలు సాగించాడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రోడ్డుపై మట్టి పోయించి సౌకర్యవంతంగా నిర్మాణం చేయించామని తెలిపారు.

## నాగారంలో వైభవంగా హనుమాన్ హోమం



**హుస్నాబాద్ మే 5 (నినాదం);-** హుస్నాబాద్ మండల పరిధిలోని నాగారం గ్రామంలో హనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక హోమ కార్యక్రమం ఆధ్యాత్మిక శోభతో వైభవంగా ముగిసింది. లోక కళ్యాణార్థం, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తబృందం సభ్యులు ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాల్లో వేద పండితుల మంత్రోచ్చారణలతో భక్తి వాతావరణం నెలకొంది. శాస్త్రోక్తంగా గణపతి పూజతో ప్రారంభమైన ఈ వేడుకలో భాగంగా హనుమాన్ హోమాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు పూర్తి చేసి పూర్ణాహుతి కార్యక్రమాన్ని కనులపండువగా గావించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంపత్, ఉప సర్పంచ్ తిరుపతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో భక్తి చైతన్యాన్ని నింపేందుకు భక్తబృందం చేస్తున్న కృషి ఎంతో గొప్పదని, స్వామివారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తబృందం సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వడ్ల కొనుగోలు ఆలస్యంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్



**కరీంనగర్, మే 5(నినాదం) :** ఖాజీపూర్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వడ్ల కొనుగోలులో ఆలస్యం, తాలు, తరుగు, తేమ పేరుతో అన్యాయం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్తాకు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు కోతలు పెడుతున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతి గింజకు కేంద్రం నిధులు అందిస్తున్నప్పటికీ కొనుగోళ్లలో రాష్ట్రానికి ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. భారీగా వడ్లు ఉత్పత్తి అయినప్పటికీ ఇప్పటివరకు తక్కువ మొత్తమే కొనుగోలు చేయడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ల కోసం కూడా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని, దళారులు రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. పంట పండించే వరకు ఒక టెన్షన్, పండిన తర్వాత అమ్ముకు నేందుకు మరో టెన్షన్ ఎందుకని, ప్రశ్నించారు. ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోందని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించడంలో విఫలమైందని విమర్శించారు. కేంద్రం నిధులు ఇచ్చినా వాటిని వినియోగించలేని అసమర్థత ప్రభుత్వంలో ఉందన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వడ్ల కొనుగోళ్లను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని, ఎలాంటి కోతలు లేకుండా కనీస మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పలు రాజకీయ అంశాలపై కూడా స్పందిస్తూ ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ కార్యక్రమం లో ఉప మేయర్ సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జ్యువెల్లరీ దాడి ఘటనతో వేడెక్కిన రాజకీయం

కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి తీవ్ర స్పందన, నిందితుల అరెస్టుకు ప్రత్యేక బృందాలు

రాష్ట్ర సామాజిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**కరీంనగర్, మే 5(నినాదం) :** జువెల్లరీ దుకాణంపై జరిగిన దోపిడీ, కాల్పుల ఘటన దురదృష్టకరమని రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను ఆయన ప్రైవేటు ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అంతర్రాష్ట్ర దొంగల ముఠా పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. నిందితులను పట్టుకోవడానికి 15 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హెచ్చరించారు. ఇలాంటి వ్యాఖ్యలు కొనసాగితే కాంగ్రెస్ కార్యకర్తల నుంచి తీవ్ర ప్రతిస్పందన తప్పదన్నారు. 2014 నుండి 2023 వరకు రాష్ట్రంలో జరిగిన నేరాలకు అప్పటి ప్రభుత్వ బాధ్యత ఏమిటని ప్రశ్నించారు. గతంలో జరిగిన ఘటనలపై స్పందించని వారు ఇప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు బాధితులను పరామర్శించలేదన్న ఆరోపణలను ఖండిస్తూ, సంఘటన జరిగిన రోజే పలువురు నాయకులు బాధితులను కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడైనా ప్రమాదాలు జరిగినప్పుడు సహాయక చర్యల్లో ముందుంటుందని మంత్రి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసులో కేంద్రం దర్యాప్తు సంస్థల ద్వారా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ఘటనలో నిందితులను త్వరలోనే అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సూడా చైర్మన్ కోమిటి రెడ్డి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ తాజోద్దీన్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కరీంనగర్, మే 5(నినాదం ):** సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జన్మదినాన్ని కరీంనగర్ నియోజకవర్గం సహా పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కేక్ కటింగ్‌లు నిర్వహించి, వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. మొదటగా అంబేద్కర్ స్టేడియంలో కాంగ్రెస్ నాయకులు గుడిపాటి రమణారెడ్డి, వెల్ది సర్పంచ్ కిషన్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు, గుండాటి శ్రీనివాస్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం. నగరంలోని ఇందిరా చౌక్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోగా, పలు ప్రాంతాల్లో వాకర్స్ సంఘాలు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భగత్ నగర్‌లోని అయ్యప్ప దేవాలయంలో హనుమాన్ దీక్ష స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సివిల్ ఆసుపత్రి, వృద్ధాశ్రమం, మాతా-శిశు ఆసుపత్రిలో అల్పాహారం, పండ్ల పంపిణీ చేపట్టారు. నాఖా చౌరస్తాలో క్రేన్ సహాయంతో గజమాలతో నరేందర్ రెడ్డిని సన్మానించి, అనంతరం భారీగా సంబరాలు నిర్వహించారు. కరీంనగర్ రూరల్ మరియు కొత్తపల్లి మండలాల గ్రామాల్లో ఉపాధి హామీ మహిళలతో కలిసి సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమాల్లో పర్వతం మల్లేశం, బొట్ల శ్యామల కిరణ్, తాజుద్దీన్, మడుపు మోహన్, కల్లేపల్లి బాలరాజు, ఖాదర్ షా, కొరివి అరుణ్ కుమార్, ఆడెపు కమలాకర్, దాసరి అశోక్, పెద్దిగారి తిరుపతి, కాంపెల్లి కీర్తి కుమార్, జక్కుల మల్లేశం, చాంద్, ఎట్టేపు వేణు, గుడిపాటి రమణ రెడ్డి, అస్తపురం రమేష్, పిట్టల రవి, షైనషా, రంగా నాయక్, మీరజ్, ఆశ్రఫ్, చెర్ల పద్మ, యనమల మంజుల, షబానా, ముల్కల కవిత, అస్తపురం తిరుమల, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మెగా ఉద్యోగ మేళా విజయవంతం

కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మే 5(నినాదం):** జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉద్యోగ మేళాలను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఈ మేళాలను క్రమం తప్పకుండా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాను కలెక్టర్ పర్యవేక్షించారు. అధికారులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు వారిని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా మరిన్ని మేళాలను నిర్వహించాలని సూచించారు. ఈ మేళాకు కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి సుమారు 3,000 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఐటీ, ఆరోగ్య, వ్యవసాయ, పాల ఉత్పత్తులు తదితర రంగాలకు చెందిన దాదాపు 90 సంస్థలు పాల్గొని నియామక ప్రక్రియ చేపట్టాయి. మొత్తం 997 మందిని ప్రాథమికంగా ఎంపిక చేయగా, 478 మందికి తక్షణ ఉద్యోగ అవకాశాలు లభించాయి. అభ్యర్థుల సౌకర్యార్థం 95 స్టాళ్లు, సహాయ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, చల్లని గాలివ్యవస్థలు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లు చేశారు. అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## మండుటెండలో రైతన్నల హరిగోస



**జమ్మికుంట, మే 5 (నినాదం) :** జమ్మికుంట పత్తి మార్కెట్లో మక్కలు అమ్ముకోవడానికి వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతన్న లు టోకెన్ల కోసం మండుటెండలో భారీగా బారులు తీరారు. మార్క్ఫెడ్ కు ధాన్యం విక్రయించడానికి అధికారులు టోకెన్లు గన్ని సంచుల కోసం ఇస్తుండడంతో సరియైన టెంటు సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో మండు టెండలోనే బారులు తీరారు. దీనికి తోడు సర్వర్ ప్రాబ్లం ఉండడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

## హనుమాన్ నామస్మరణతో మారు మ్రోగిన జమ్మికుంట

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర

జెండా ఊపి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట, మే 5 (నినాదం):** జై బోలో హను మాన్‌కి రామ లక్ష్మ ణ జానకి అంటూ వందలాదిమంది హనుమాన్ మాల దారులు అంగ రంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. జమ్మికుంట పట్టణంలోని శంకర్ నందన గార్డెన్ నుండి మోత్కులగూడెం చౌరస్తా మీదుగా గాంధీ చౌరస్తా తో పాటు ప్రధాన వీధులలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్రను నాయకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయాత్రను మున్సిపల్ చైర్మన్ దిలీప్ కుమార్ సీఐ రామకృష్ణ గౌడ్ ప్రారంభించారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా వందలాది మంది భక్తుల హనుమాన్ మాలదారులతోపాటు స్థానిక బిజెపి నాయకులు మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ అంగరంగ వైభవంగా శోభయాత్రను నిర్వహించారు. శ్రీరాముని ప్రతిమతో పాటు భారీ హనుమంతుని ప్రతిమను ఏర్పాటు చేసి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. పట్టణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో హనుమాన్ రథయాత్రను ఆద్యాంతం ఆసక్తికరంగా తిలకిస్తూ హనుమాన్ నామస్మరణ లో ఉండిపోయారు. మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ బిజెపి నాయకులు ఆకుల రాజేందర్ కొలకాని రాజు దొంతరవేన రమేష్ యాదవ్ పి జె ఆర్ బచ్చు శివకుమార్ పాకాల రవీందర్ రెడ్డి ఆవుల తిరుపతి సింగిరెడ్డి తిరుపతి రెడ్డి యాంసాని సమ్మయ్య పాల్గొన్నారు.

## రూ.కోటి వ్యయంతో 17 ఓపెన్ వ్యాయామశాలలు

నాల్కో సంస్థ సామాజిక బాధ్యత

కమాన్‌పూర్‌లో సీసీ రహదారి పనులకు శ్రీకారం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



**కరీంనగర్, మే 5(నినాదం):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన "ఫిట్ ఇండియా" లక్ష్యానికి అనుగుణంగా కరీంనగర్ నగరంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచు కుని ఓపెన్ వ్యాయామశాలలను ఏర్పాటు చేస్తు న్నారు. సుమారు రూ. కోటి వ్యయంతో 17 డివిజన్లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయగా, నాల్కో సంస్థ సామాజిక బాధ్యత నిధుల సహకారంతో మలయప్ప ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో కిసాన్ నగర్ అంబేద్కర్ యువజన సంఘం సమీపం లో, దుర్శేడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ వ్యాయామ శాలలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉద్యోగ, వ్యాపారాల్లో నిమగ్నమై శారీరక దృఢత్వాన్ని కోల్పోతున్న ప్రజలకు ఈ వ్యాయామశాలలు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లలో వీటిని విస్తరించి ప్రజలు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలతో చేపట్టిన సీసీ రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గత ఆరు సంవత్సరాల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఈ పథకం ద్వారా విస్తృతంగా అభివృద్ధి పనులు జరిగాయని, ప్రస్తుతానికి మంజూరైన నిధులతో మరిన్ని పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలపై సీఎంకు మద్దతుగా కాంగ్రెస్ ఫిర్యాదు

-కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్‌కుమార్



**కరీంనగర్, మే 5(నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి కె.టి. రామారావు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మే 4న కరీంనగర్‌లో జరిగిన పత్రికా సమావేశంలో కేటీఆర్, పీఎంజే ఆభరణాల దుకాణం దోపిడీ ఘటనను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి గతంలో జైలులో ఉన్నారని, తన అనుచరులతో దోపిడీ చేయించారని వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 356, 353 ప్రకారం నేరమని అంజన్ కుమార్ స్పష్టం చేశారు. ఈ విధమైన వ్యాఖ్యలు ప్రజల్లో ప్రభుత్వంపై, పోలీసు వ్యవస్థపై అపనమ్మకం కలిగించే ప్రయత్నమని విమర్శించారు. రాజకీయ విమర్శలు పరిమితుల్లో ఉండాలని, వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని ఆయన అన్నారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని, అవసరమైతే ఇతర సంబంధాలపై కూడా దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండి తాజుద్దీన్, భాస్కర్ నాయక్, పడిశెట్టి భూమయ్య, మహమ్మద్ ఇమ్రాన్, కంకణాల అనిల్, షుకూర్, ఆసిఫ్, ఇమ్రాన్ ఘని, అబ్దుల్ రెహమాన్, జక్కుల మల్లేశం, కుంభాల రాజకుమార్, సుదర్శన్ రెడ్డి, నిహాల్ అహ్మద్, శంకర్ పాల్గొన్నారు.

## ప్రజల వినతికి స్పందించిన ఆర్డీఓ



**మెట్ పల్లి, మే 5: ( నినాదం):** ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేస్తేనే తక్షణ పరిష్కారం సాధ్యమని మరోసారి రుజువైంది. పట్టణం లో ఇందిరమ్మ ఇళ్లు, శ్మశానం స్థలం కేటాయింపుపై వచ్చిన వినతికి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మాజీ కౌన్సిలర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎండీ షకీర్ మంగళవారం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పి స్తూ, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయా లని కోరారు. అలాగే 12వ వార్డులోని వైఎస్సార్ అర్బన్ ఇందిరమ్మ కాలనీలో సుమారు 800 మంది నివసిస్తున్న ప్పటికీ, శ్మశానం స్థలం లేక మృతదేహాలను దాదాపు 7 కిలోమీటర్ల దూరం తరలించి అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందని వివరించారు.

## అస్తమాను నిర్లక్ష్యం చేయొద్దు



ముందస్తు గుర్తింపే రక్షణ

లక్షణాలను గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అస్తమా నియంత్రణ సులువు

మెడికవర్ పల్మనాలజిస్టు డాక్టర్ రవీంద్రచారి

**కరీంనగర్, మే 5(నినాదం )**మెడికవర్ హాస్పిటల్‌లో నిర్వహించిన ప్రపంచ అస్తమా దినోత్సవ అవగాహన కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి పల్మనాలజిస్టు డాక్టర్ రవీంద్రచారి అస్తమాపై ముఖ్య సూచనలు చేశారు. అస్తమా అంటు వ్యాధి కాదని, దుమ్ము, చల్లని గాలికి శ్వాసనాళాలు ప్రతిస్పందిం చడం వల్ల ఈ సమస్య వస్తుందని తెలిపారు. దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలర్జీ వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అస్తమా జీవితాంతం మందులు తీసుకోవాల్సిన వ్యాధి కాదని, తొందరగా గుర్తిస్తే సులభంగా నియంత్రించవచ్చని చెప్పారు. మాత్రల కంటే ఇన్‌హేలర్ వినియోగం మెరుగైన ఫలితాలు ఇస్తుందని, దీనిపై ఉన్న అపోహలను నమ్మవద్దని సూచించారు. దుమ్ము, చల్లని వాతావరణం నుంచి దూరంగా ఉండడం, అలర్జీ కలిగించే ఆహారాలను నివారించడం ద్వారా అస్తమా నియంత్రణ సాధ్యమని వివరించారు. సమస్య వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని, వ్యాధిపై భయం వద్దని పేర్కొన్నారు. క్రిటికల్ కేర్ నిపు ణులు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్‌లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాం క, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తికి ఉపశమనం "చలివేంద్రం"



**హుస్నాబాద్ మే 5 (నినాదం):** అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో సర్పంచ్ సుగుర్తి శ్రీలత బాలరాజు, ఉప సర్పంచ్ లింగాల కనుకయ్య చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా గ్రామ ప్రజలు, రైతులు, కార్మికులు, వృద్ధులు తాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కోకుండా గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకుంటామని తెలిపారు. ఈ చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత మజ్జిగ పంపిణీ



**కరీంనగర్, మే 5(నినాదం) :** జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులకు టీఎన్జీవోల సంఘం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసింది. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 2500 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో, కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ చల్లని మజ్జిగను అందించి ఉపశమనం కలిగించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఎండల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న దాహం, అలసటను తగ్గించేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు అవసరమని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన జిల్లా కలెక్టర్‌కు, పరిపాలన యంత్రాంగానికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రతి సోమవారం జరిగే ప్రజా వినతి కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం కూడా ఉచిత మజ్జిగ పంపిణీ కొనసాగుతున్నదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పంటపొలాలు దగ్ధం





-70 ఎకరాలకు పైగా కాలిపోయిన మక్కలు

**జమ్మికుంట, మే 5 (నినాదం):** జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామ పంచాయతీ పరిధిలో గల గోపాలపురం గ్రామం లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడం తో వందలాది క్వింటాళ్ల మక్కలు, సీడ్ వడ్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయిపోయాయివావిలాల గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన రైతులు కౌటం ఎల్లయ్య కౌలు రైతు ఇతనితో పాటుగా పాటుగా కలకోట బాపు ,చేపూరి గట్టయ్య, చేపూరి రజనీకాంత్, సార్ల శంకర్ రైతులకు చెందిన మొక్క పెరడి షార్ట్ సర్క్యూట్ తోని ప్రమాదవశాత్తు దగ్ధం కావడం జరిగింది. సుమారు 70 నుంచి 80 ఎకరాల పంట పూర్తిగా మంటల్లో కాలిపోయిందని రైతన్నలు లబోదిబోమని విలపిస్తున్నారు. తన సమయంలో ఒక్కసారిగా విద్యుత్ తీగలు ఒకదానితో ఒకటి షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు ఎగిసిపడి పంట పొలాలు దగ్ధమయ్యాయని సీడ్ వరి పంట సైతం కాలిపోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న హుజరాబాద్ ఆర్డీఓ రమేష్ ఆర్ఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని రైతులను ఓదార్చడంతో పాటు నష్టం వివరాలను సేకరించారు. జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన ముత్యాల మల్లేష్ అనే రైతుతో పాటు వంతడుపుల ఇల్లందకుంట గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు సైతం పూర్తిగా కాలిపోయాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వ మాదుకోవాలని బావిలాల సర్పంచ్ కొండ అర్జున్ గౌడ్ కోరారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పండ్లు పంపిణీ



**జమ్మికుంట, మే 5 (నినాదం) :** జమ్మికుంట పట్టణంలో మంగళవారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు జమ్మికుంట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చల్లటి నీరు అరటి పండ్లను అందించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గుడివాడ వెంకట సతీష్ రేణిగుంట రాజు మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణంలో వేలాది మంది భక్తులు పాల్గొనగా ఏర్పాటు చేసిన హనుమాన్ శోభాయాత్రను తిలకించడానికి వచ్చిన భక్తులతో పాటు పాల్గొన్న భక్తులకు ఎండ వేడిమి నుండి ఉపశమనం కొరకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చల్లటి మజ్జిగ తోపాటు అరటి పండ్లను అందించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు గోసపడుతున్నారు

### ఎమ్మెల్సీ మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్

### ప్రభుత్వం పనితీరును ఎండగట్టేందుకు నేడు వరంగల్‌కు కేటీఆర్ రాక



**హనుమకొండ, మే5 (నినాదం):** రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును ఎండగట్టేందుకే బీ ఆర్ ఎస్ పార్టీ బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని గ్రీన్ వుడ్ పాఠశాల గ్రౌండ్లో ఏర్పాటు చేస్తున్న రైతు సంగ్రామ సదస్సుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా బీ ఆర్ ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు నాట్లు వేయకముందే రైతుబంధు నిధులను రైతుల ఖాతాలో జమ చేసేవారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు గోసపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతోనే కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.గతంలో రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిస్తే కేసీఆర్ ప్రభుత్వంలో మూడు వేల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసే దశకు తీసుకువచ్చిన ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల డిక్లరేషన్లు ఉల్లంఘన గురయ్యాయని ఆయన విమర్శించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, సిగ్గులేక ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారని దమ్ముంటే వరంగల్ మార్కెట్ కు రావాలని ఆయన సవాల్ విసిరారు. కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులను సకాలంలో వేసి ఆదుకున్నారని ఆయన గుర్తు చేశారు.మార్కెట్లో మక్కల కొనుగోళ్ళు కానీ బోనస్ డబ్బులు రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మార్కెట్లో కాంటాలు కరెక్ట్ లేక గన్నీలు అందుబాటులో లేక రైతులు గోసపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కేటీఆర్ రాక పిలుపును అందుకొని రైతులు వేలాదిగా తరలివస్తున్నారని రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ రైతుల డిక్ల, ముఖ్యమంత్రి ఆరు పథకాల హామీలను విస్మరించాడని వీటి అమలు తీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసేందుకే రైతు సంగ్రామ సదస్సును నిర్వహిస్తున్నామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు ఎక్కడా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన విమర్శించారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు రైతు డిక్లరేషన్ హామీని నిలబెట్టుకునేందుకు ఒత్తిడి తీసుకురావాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రతీకారా పాలన చేస్తుందని ఆయన విమర్శించారు. రైతులకు, ప్రజలకు మేలు చేయని మేళాలు నిర్వహిస్తున్న తీరును ప్రతిపక్ష పార్టీగా గులాబీ సైనికులం నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. సభ నిర్వహణను అడ్డుకునేందుకు అధికార పార్టీ అడ్డంకులను సృష్టించిందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంలో సమైక్య రాష్ట్రంలో శాంతియుతంగా కేసీఆర్ నాయకత్వంలో సభలు సమావేశాలు నిర్వహించామని తమ నాయకుడి రాక సందర్భంగా కార్యకర్తలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను,కటౌట్లను తొలగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అటు కాంగ్రెస్ కార్యకర్తలు ఇటు పోలీసులు సభను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేటీఆర్ రాక సందర్భంగా రైతులు అంచనాలకు మించి రైతులు వేలాదిగా తరలి వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు తాటికొండ రాజయ్య, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, ఆరూరి రమేష్, నాయకులు నాగూర్ల వెంకటేశ్వరరావు, పులి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన మునిసిపల్ కమిషనర్



**అమరచింత, మే 5, (నినాదం):** ఆత్మకూర్ నిసిపాలిటీ లో ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులను నిరంతరం చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ చికినే శశిధర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్ ప్రధాన రహదారి వివిధ వార్డులోని కాలువలను పారిశుద్ధ సిబ్బంది చేత పనులను శుభ్రం చేయించారు. ప్రధానంగా మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన రహదారుల పై ఉన్న దుమ్ము ధూళిని మునిసిపాలిటీ సిబ్బందితో తొలగిస్తున్నారు. కమిషనర్ ప్రతిరోజు తన పర్యవేక్షణలో కార్మికులతో పనులు చేయిస్తూ పట్టణ ప్రజల మన్ననలు పొందుతున్నారు. 10 వార్డ్ లోనూ ప్రజల నుండి ఎలాంటి సమస్య వచ్చినా అప్పటికప్పుడే పరిష్కారం చూపడంలో కమిషనర్ కృషి చేస్తున్నారు. సమస్యల పరిష్కారంలో మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆయన రాజీపడడం లేదు. మున్సిపల్ కమిషనర్ గా తన వృత్తిపట్ల బాధ్యతగా ఉంటున్న కమిషనర్ ను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

## గంగమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో మండల పూజా కార్యక్రమాలు



**పెబ్బేరు, మే 04 (నినాదం) :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి ప్రతిష్టాపనకు 41 రోజులు పూర్తి కావడంతో అమ్మవారి ఆలయంలో మండల పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెబ్బేరు మత్స్యకార సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గణపతి పూజ, నవగ్రహ పూజలు, ప్రత్యేక అభిషేకాలు, హోమం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని విశేషంగా ఆరాధించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు గురు రాఘవాచార్యులు, నవీనా చార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు చింతకాయల కురుమూర్తి, భీముడు, మహేష్, బాలస్వామి, తిరుపతయ్య, కర్రెన్న, మన్యం, శివ, దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



**మిర్యాలగూడ, మే 5, (నినాదం):** రైతులు లాభాలు పొందాలంటే ప్రత్యామ్నాయ పంట ముఖ్యంగా పామ్ ఆయిల్ సాగు చేయాలని మిర్యాలగూడ వ్యవసాయ శాఖ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎటి మేకల బుష్యేంద్రమణి అన్నారు. మంగళవారం లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ 99 రోజుల లక్ష్యాల్లో భాగంగా రైతులకు శిక్షణ, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై ప్రత్యేక దృష్టి, నీటి పొదుపు, ఆధునిక పద్ధతుల్లో ఉద్యాన పంటల సాగు దామరచర్ల మండలంలో రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ సాంప్రదాయ పంటల కంటే ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా అధిక లాభాలను అందిస్తుందన్నారు. దీనికి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాబోయే కాలంలో జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

**ప్రత్యామ్నాయ పంటలు - ఆధునిక విధానాలు**

కేవలం వరి, పత్తి వంటి పంటలపైనే ఆధారపడకుండా, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే కూరగాయలు, పండ్లు, పూల సాగు వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని అధికారులు రైతులకు సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంట మార్పిడి పద్ధతులను పాటించాలన్నారు. సదస్సులో సర్పంచ్ బంటు. రేణుక సిరి, ఉద్యాన శాఖ అధిక, శాస్త్రవేత్త నళిని, ఆయిల్ పామ్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కృష్ణవేణి, ఆయిల్ పామ్ పతంజలి ఫుడ్ కార్పొరేషన్ మధుసూదన్ రెడ్డి, ఆయిల్ పామ్ ఫీల్డ్ స్టాఫ్, ఏఇఓలు హెచ్ఇఓ,స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి, తాలు, గడ్డి లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి





### ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

**అమరచింత, మే 5, (నినాదం):** వరి ధాన్యంలో గడ్డి, తాలు, మట్టి లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేయాలని రైతులకు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటుచేసిన క్లీనర్లను వినియోగించుకుని వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆత్మకూర్, అమరచింత మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యర్డు(పాక్స్ ), అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి రైతు వేదిక వద్ద ఏర్పాటుచేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నమోదు రిజిస్టర్లను తనిఖీ చేసి, ఇన్చార్జిలకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటుచేసిన క్లీనర్లను వినియోగించుకుని వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. చాలా చోట్ల వరిలో తాలు, మట్టి, గడ్డి ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. తాలు లేకుండా ఉంటే మిల్లర్లకు ధాన్యంలో కోత పెట్టడానికి ఆస్కారము ఉండదని సూచించారు. కాబట్టి రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన తమ ధాన్యంలో తాలు లేకుండా, ప్యాడి క్లీనర్లను వినియోగించుకుని శుభ్రపరచుకోవాలన్నారు. .అనంతరం ధాన్యం నమోదు రిజిస్టర్లను తనిఖీ చేసిన కలెక్టర్ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను వరుస క్రమంలో రిజిస్టర్లలో నమోదు చేసుకుని వరుస క్రమంలో తూకం చేసి వెంటనే లోడింగ్ చేసి కేటాయించిన మిల్లులకు పంపాలన్నారు. ట్రాన్స్ పోర్ట్ విషయంలో లారీలకు సంబంధించి ఇలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని డిఎం కు సూచించారు. అదేవిధంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరేనా సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో తాగునీ రు, నీడ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దాన్ రకం వరి వేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ రకం పంట వేయడం ద్వారా నూక ఎక్కువగా వస్తుందని రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు.

**రహదారి పరిశీలన**

ఆత్మకూరు మండల కేంద్రంలో కోర్టుకు వెళ్లే రహదారికి, ఎంపీడీవో కార్యాలయ కాంపౌండ్ వాల్ కు ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు కాగా సంబంధించి ఎంపీడీవో కార్యాలయానికి అనుకొని ఉన్న మార్గంలో విస్తరణకు సంబంధించిన దారిని కలెక్టర్ పరిశీలించారు. రహదారి విస్తరణకు సంబంధించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ లు రవికుమార్ జీకే మోహన్ ఎంపీడీవో శ్రీపాదు, శ్రీనివాసులు డి ఎం ఆంజనేయులు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



**మిర్యాలగూడ మే 5 (నినాదం):** మిర్యాలగూడలో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనకి లు నిర్వహించారు, వ్యవసాయ అధికారి ఏం. రుషేంద్రమని దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని దుకాణాల్లో పూర్తిస్థాయి తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. లూజు విత్త నాలు, నాణ్యతలేని విత్తనాలను అమ్మి తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ప్రతిరైతు రశీదు తీసుకోవాలని సూచించారు.అన్ని రకాల విత్తనాల దిగుబడి ఒకే రకంగా ఉం టుంది. రైతులు కొన్ని రకాల విత్తనాలే అధిక దిగుబడి వస్తాయనే అపోహ పడ కుండా అందుబాటులో ఉన్న విత్తనాలను విత్తుకోవాలి. లైసెన్స్ ఉన్న షాపుల్లోనే విత్త నాలు కొనాలి. రశీదులు జాగ్రత్తగా ఉంచుకోవాలి. అధిక ధరలకు అమ్మితే డీలర్లపై చర్యలు తీసుకుంటాం అని వివరించారు - ఈ కార్యక్రమములో మిర్యాలగూడ అధ్యక్షులు తెడ్ల జవహర్ బాబు,వ్యవసాయ విస్తరణ అధికారి షఫి ఉన్నారు.

## ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు

### ఎంపీడీవో రవీంద్రనాథ్



**మహాదేవపూర్ మే 5, (నినాదం):** 2025- 26 ఆర్థిక వార్షిక ప్రణాళికలో భాగంగా స్వయం ఉపాధి కోసం వివిధ యూనిట్లకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు ఈనెల 8 శు క్రవారం ఉదయం 11 గంటలకు మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్య అభ్యర్థులు ఆన్లైన్ లో అప్లై చేసిన దరఖాస్తు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తాజాగా తీసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీచేసిన కుల ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ సర్టిఫికెట్, వ్యవసాయానికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, లాంటివి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు సకాలంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

## డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లుచేయాలి

### కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మే 5 (నినాదం):** మిర్యాలగూడ పట్టణం గుమస్తాల కాలనీలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీ ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన గుమస్తాల కాలనీలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీకి వచ్చే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెత్త,చెదారం, చెట్ల తొలగింపు తో పాటు, రోడ్డును డోజర్ తో గుంతలు పూడ్చి సమాంతరం చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలోని డ్రైన్లు త్రీఫేజ్ పవర్, ప్రతి ఇంటికి ఎర్తింగ్, కరెంట్ మీటర్లు ఏర్పాటు చేసేలా చూడాలని ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు. ప్రతి ఇంటిపై వాటర్ ట్యాంకులకు నీటిని ఎక్కించి నీటి సరఫరాను పరిశీలించాలని, అలాగే ప్రతి ఇంట్లో వైరింగ్‌తో పాటు, ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అన్ని పనులు వేగంగా పూర్తి చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. బుధవారంలోగా వాటర్ ట్యాంకులను నీటితో నింప డం ,ప్రతి ఇంటికి నీటి సరఫరాను తనిఖీ చేయడం పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి ఇంట్లో టాప్ కనెక్షన్ తో పాటు, బల్బులు, ఇతర సౌకర్యాలు చూడాలన్నారు. ఎక్కడా ఓపెన్ డ్రైనేజీ ఉండడం, పైపులు పగిలిపోవడం లేదా భవిష్యత్తులో సమస్యలు వచ్చేలా ఉండకుండా చూడాలని ఆదేశించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ఇతర మంత్రులు, ప్రజా ప్రతినిధులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీ ప్రారంభానికి హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లన్నీ చూడాలని, అలాగే ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే సభా వేదిక, ఇతర ఏర్పాట్లను కూడా చేయాలని , అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, మిర్యాలగూడ ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



**నర్సంపేట, మే 05 (నినాదం):** ఇటీవల జరిగిన ఆర్టీసీ సమ్మెలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట డిపోకు చెందిన ఆర్టిసి డ్రైవర్ కోల శంకర్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విషయం తెలిసిందే అయితే నేడు స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సహకారంతో సంబంధిత 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెక్కును శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు నర్సంపేట ఆర్డీవో ఉమారాణి చేతులమీదుగా అందజేశారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండం లక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎల్లవేళలా శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు శంకర్ గౌడ్ కుమారుడు కోల హేమంత్ కు ఉద్యోగం ఇచ్చేందుకు నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆర్టిసి ఎండితో మాట్లాడడం జరిగిందని ప్రభుత్వాన్నికి లేఖ పంపించారని తెలిపారు అతి త్వరలో శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్ కు కార్పొరేషన్‌లో ఉద్యోగం ఇప్పించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో,మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్,వైస్ చైర్మన్ గంధం నరేంద్ గుప్తా ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరపనులు నిర్ణత గడువులోగా పూర్తి చేయాలి

### అంత్య పుష్కరాలు విజయవంతానికి అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, మే 05(నినాదం):** మే 15 లోగా సరస్వతి అంత్య పుష్కరాల పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల పనుల పురోగతిపై ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీసు, అటవీ, రవాణా, వైద్య, ఇరిగేషన్, అగ్నిమాపక, విద్యుత్, మత్స్య, ఆర్టీసీ, మిషన్ భగీరథ, దేవాదాయ, పీఆర్, కె ఎం కె తదితర శాఖల అధికారులతో ఎస్పి సంకీర్త్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శాఖలవారిగా చేపట్టిన పనులు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు చలువ పందిళ్లు, బట్టలు మార్చు గదులు, దివ్యాంగుల కొరకు బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుండి సరస్వతి ఘాట్ వరకు భారీకేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. రహదారుల్లో గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పోలీస్, ఆర్అండ్ బి అధికారులు సంయుక్తంగా పరిశీలించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని అన్నారు. నదిలోకి వెళ్లడానికి తాత్కాలిక రహదారి నిర్మాణంతో పాటు క్వయర్ మాట్స్ వేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు, సురక్షిత మంచినీటి సరఫరా చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సిబ్బందికి వసతి సౌకర్యం కల్పనకు ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. వ్యర్థాలు తరలింపుకు ట్రాక్టర్లు, బ్లీచింగ్ అందుబాటులో ఉంచాలన్నారు. బస్ స్టాండ్ వద్ద విద్యుత్, ప్రయాణికుల కొరకు షెడ్స్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. హారతి, తెప్పోత్సవం కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని దేవాదాయ అధికారులకు సూచించారు. ఆహ్వాన పత్రికలు తయారు చేయాలని, దేవాలయాన్ని అందంగా విద్యుద్దీకరణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెస్క్యూ టీములు ఏర్పాటు చేయాలని తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, రవాణా అధికారి సంధాని, వైద్య శాఖ అధికారి డా మధుసూదన్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి రావు, అగ్నిమాపక అధికారి సతీష్ కుమార్, డిపిఓ శ్రీలత, ఆర్టీసీ డిఎం ఇందు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, మిషన్ భగీరథ ఈఈ శ్వేత, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మత్స శాఖ అధికారి విజయ్ కుమార్, దేవస్థానం ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు



**అమరచింత, మే 5, (నినాదం):** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను పురస్కరించుకుని మంగళవారం అమరచింతలో టిఎన్టియుసి నాయకులు మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల జెండా కట్ట వద్ద మండల అధ్యక్షులు సంగెపాగు దాసు జెండా ఆవిష్కరణ చేసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ మీడియా కార్యక్రమానికి కార్యక్రమానికి జింక రవి యాదవ్ , ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ బోరింగ్ శ్రీనివాసులు, జే.ప్రకాశం హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పని దినాల కోసం 141 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు పోరాడి విజయం సాధించిన కార్మికులకు ఈ మేడే పండుగ రోజని అన్నారు. కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్స్ సభ్యులు తౌఫిక్,డేవిడ్ ,మార్కెట్ కమిటీ మాజీ సభ్యులు శ్యాం కుమార్ నాయకులు బుచ్చిరెడ్డి ,సత్యా రెడ్డి ,హనుమంతు నాయక్ ,బధ్యానాయక్, నరేష్ యాదవ్, శరత్ ,ఇమ్మానుయేలు ఐ ఎన్ టి యు సి నాయకులు జానిస్టు ,దేవరాజు ,మేస్త్రి రాజు ,సవరన్న,బాలరాజు ,విజయ్ పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో పశువుల ఆసుపత్రి వద్దు

- శాంతినగర్ గ్రామస్తుల డిమాండ్
- అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం



**కోదాడ, మే 5(నినాదం):** శాంతినగర్ గ్రామంలో పాఠశాల ప్రాంగణంలో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి గ్రామస్థులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆసుపత్రిని వేరే చోట నిర్మించాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై గ్రామస్థులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సిపిఐ నేత బద్దం కృష్ణారెడ్డి, సర్పంచ్ ఉమా కూడా ఈ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని వారు హెచ్చరించారు. సర్పంచ్ పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో అనుమతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామసభ తీర్మానం మేరకు ప్రత్యామ్నాయ స్థలం సూచించినప్పటికీ, అదే స్థలంలో నిర్మాణానికి కొన్ని రాజకీయ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పశువైద్యశాలను వేరే చోట నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆయిల్ ఫాం సాగుకు రైతులు ముందుకు రావాలి

**జిల్లా కలెక్టర్ హరిత**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మే5 (నినాదం) :** జిల్లాలో ఆయిల్ ఫాం సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అర్హులైన రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ హరిత సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రైతు వారోత్సవాల సందర్భంగా జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగు నీరు అందుబాటులో ఉన్న రైతులు ఆయిల్ ఫాం పంటను చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం ఈ పంటకు సబ్సిడీ కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ ఫాం సాగులో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర్ పంటలు వేసుకోవచ్చని, దీంతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఆయిల్ ఫాం పంటకు చీడపీడలు, పశువులు, కోతుల బెడద తక్కువగా ఉంటుందని, దీని ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. సంప్రదాయ పంటలైన పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫాం, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కూరగాయల పంటలు సాగు చేయడం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందడమే కాకుండా కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దేశంలో వంట నూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పరిస్థితుల్లో ఆయిల్ ఫాం సాగు విస్తరిస్తే స్థానికంగా చౌకగా నూనెలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నా రు. రైతులు పెద్ద సంఖ్యలో ఈ పంట సాగుకు ముందుకు రావాలని, అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కాండె అనిల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల్ల మంగ, కుద్మేత విశ్వనాథ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి వెంకటి తదితరులు పాల్గొ న్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో ఆదర్శం గా నిలిచిన రైతులను శాలువాలతో సన్మానించారు.

## చెన్నూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి అంబర్ కిషోర్ ఝా



**చెన్నూర్ మే4 (నినాదం) :** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు, స్టేషన్ భౌగోళిక పరిస్థితులు,సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలో అధికంగా నమోదవుతున్న కేసుల వివరాలు, గ్రామాల వివరాలను సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ కోసం పెట్రోలింగ్ మరియు విజిబుల్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దు పోలీస్ స్టేషన్ కావడంతో పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సరిహద్దు గ్రామాలను తరచుగా సందర్శించాలని, మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు....

## లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**మంచిర్యాల, మే 5(నినాదం):** ఈ ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశిత లక్ష్య సాధనకు ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా కృషిచేయాలని శ్రీరాంపూర్ జిఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళ వారం ఆర్కె 7 గనిలో అధికారులు, సేఫ్టీ కమిటీ, మైన్ కమిటీ, మైనింగ్ స్టాఫ్ , సూపర్వైజర్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి , ఉత్పాదకత, యంత్రాల వినియోగం, పరికరాలు ఇలా అన్ని అంశాలపై ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు . గత ఏడాది స్వల్ప తేడాతో ఆర్కె7 గని ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేపోయిందన్నారు. ఈ ఏడాది నూరు శాతం ఉత్పత్తి సాధన దిశగా అడుగులు వేయాలన్నారు. గతంలో ఎంతో మంచి ఉత్పత్తి చరిత్ర ఉన్న ఈ గని ఈసారి కూడా రక్షణతో కూడిన ఉత్తత్తి లక్ష్యాన్ని సాధించాలని కోరారు. డ్రిల్స్ సంఖ్య పెంచటంతో పాటు, ఎస్డిఎల్ యంత్రాల ద్వారా ఉత్పత్తి శాతం పెరగాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి సంస్థగా నిర్దేశిత లక్ష్య సాధనతోనే సింగరేణికి సంస్థ మనుగడ సాధ్యమన్నారు. ఓపెన్ కాస్ట్ గనులకు ధీటుగా భూగర్భ గనులు నడపాల్సిన ఆవశ్యకత నెలకొన్నది అన్నారు. మ్యాన్ పవర్ పూర్తి స్థాయిలో వినయోగించుకుంటూ రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, గ్రూప్ ఏజెంట్ . రాజేందర్ , గని మేనేజర్ తిరుపతి, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్, సంక్షేమ అధికారి సంతన్, పిట్ సెక్రటరీ సారయ్య, అసిస్టెంట్ మేనేజర్లు , అండర్ మేనేజర్లు, మైనింగ్ స్టాఫ్, సూపర్వైజర్లు, మైన్స్ కమిటీ మెంబర్లు, సేఫ్టీ కమిటీ మెంబర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ ప్రతినిధి, మే5 (నినాదం):** కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళ వారం సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేయాలని అన్నారు. సిఎంఆర్ కు సంబంధించిన వివరాలను మిల్లర్ల వారిగా సమీక్షించారు. సిఎంఆర్ డెలివరీలో వెనుకబడిన మిల్లర్లు, ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. అన్ని మిల్లులలో, మిల్లులకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి అధికారులు, మిల్లర్లకు అవగాహన కల్పించాలని వివరిం చారు. సీఎంఆర్ ప్రక్రియలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యపు సంచులు ఉంచడానికి తగిన గోదాములు ఇతరత్రా ప్రదేశాలు అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే లారీల ద్వారా ధాన్యపు సంచులను తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధాన్యపు సంచులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



**కాగజ్ నగర్ మే 5(నినాదం) :** పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చింతలమానేపల్లి మండలం డబ్బా ఎక్స్ రోడ్ వద్ద శ్రీ శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని స్థానిక ఎస్ఐ జీవన్, సర్పంచ్ డోంగ్రి సంతోష్ కలిసి ప్రారంభించారు. బాటసారులకు, వాహనదారులకు నిత్యం స్వచ్ఛమైన, చల్లని మినరల్ వాటర్ అందుబాటులో ఉంటుంది సామాన్యుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎస్ఐ జీవన్ యూత్ సభ్యులను కొనియాడారు. అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో మాలి సంఘం మండల అధ్యక్షుడు నీకోడే సందీప్, వార్డు సభ్యులు, యువ నాయకులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాసర ఐఐఐటిలో విద్యార్థులకు నైపుణ్యాత్మక విద్యాబోధన అందించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ ప్రతినిధి, బాసర మే5 (నినాదం):** బాసర ఐఐఐటీలో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ ఐఐఐటి క్యాంపస్‌ను సందర్శించి, యూనివర్సిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించిన విభాగాలు, మొత్తం విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న విద్యా విధానం, అధ్యాపకుల వివరాలు, వసతి సౌకర్యాలు, సదుపాయాలు, విద్యార్థులు సాధించిన విజయాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, క్యాంపస్ విద్యార్థులను ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా బోధనలో ఆధునిక, సులభతర పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధన సాగించాలని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులందరికీ ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యను అందించాలని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. యూనివర్సిటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం యూనివర్సిటీ అధికారులు జిల్లా కలెక్టర్‌ను, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌లను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసీల్దార్ పవన్ చంద్ర, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతంగా నిర్వహించేలా చర్యలు

కలెక్టర్ కోయ శ్రీ హర్ష
పంట కొనుగోళ్లు,నిల్వలు,రవాణాపై సమగ్ర సమీక్ష
ఎలిగేడు మండలంలోని నర్సాపూర్
ఐ.కే.పీ.,కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**పెద్దపల్లి రూరల్,మే 05(నినాదం):** ధాన్యం లోడింగ్,అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ ఐకేపీ,మంథనిలోని,గంగపురి ఐ.కె.పి, కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ పరిశీలనలో భాగంగా కేంద్రానికి వచ్చిన పంట పరిమాణం,ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,తేమ ఉన్న పంటను వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కేంద్రంలో అవసరమైన తార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని,గన్నీ బ్యాగుల సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వేడిగాలుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఉదయం,సాయంత్రం వేళల్లో లోడింగ్,అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రవాణా వాహనాలు,హమాలీల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యాకన్న,మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,ఏ.డి. ఏ.అంజని,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతులు పంట మార్పిడి, లాభదాయక పంటలపై దృష్టి సారించాలి

ఆయిల్ పామ్ సాగును విస్తరించాలి
ప్రజా ప్రభుత్వంలో రైతులకు భారీ సబ్సిడీలు
వరి సాగే కాకుండా ప్రత్యామ్నాయ పంటలు కూడా పండించాలి
ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు





**సుల్తానాబాద్/ పెద్దపల్లి రూరల్ మే5 (నినాదం):** రైతులు పంట మార్పిడి లాభదాయక పంటలపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్ద పల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రంలో మంగళ వారం నిర్వహించిన రైతు వారోత్సవకార్యక్రమం లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ఆయన పాల్గొన్నారు.అనంతరం ఆయిల్ ఫామ్ రైతులకు చెక్కులు పంపిణీ చేసి, మాట్లాడుతూ,తన చిన్న నాటి రోజుల్లో ఎలిగేడు మండలంలో కాలువ నీరు అందుబాటులో లేకపోయే దని గుర్తుచేశారు. అ నంతరం జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ నా యకత్వంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగి కాలువల ద్వారా రైతులకు నీరు అందించ బడిం దన్నారు. మొదటి దశలో అప్పటి కరీంనగర్ జి ల్లాలో 5.4 లక్షల ఎకరాల కు నీరు అందించగా, అందులో 1.4 లక్షల ఎకరాలు పెద్దపల్లిలోనే ఉ న్నాయని తెలిపారు. 2014 తర్వాత అప్పటి ప్ర భుత్వం శ్రీరాంసాగర్ కాలువలను నిర్లక్ష్యం చేసి ఇతర ప్రాజెక్టులపై దృష్టి సారించడం వల్ల ఈ ప్రాం త రైతులకు నష్టం జరిగిందని విమర్శించారు. గతంలో పెసర్లు, జొన్నలు, కందులు వంటి పంటలు పండించిన రైతులు ఇప్పుడు ఎక్కువగా వరి పం టపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఇది రైతులకు లాభదాయకం కాదని, పంట మార్పిడి చేపట్టి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు.రైతులు ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలను సాగు చేయాలని, భూమి సారాన్ని కాపాడేందుకు యూరియా విని యోగాన్ని తగ్గించాలని, పంట అవశేషాలను కా ల్చడం మానుకోవాలని సూచించారు. మన ని యోజకవర్గంలో కొంతమంది రైతులు ఎకరానికి రూ.1 లక్ష నుండి రూ.1.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. వచ్చే ఏడాది ఎలిగే డు మండలంలో కనీసం వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకొని అధికారులు, ప్ర జాప్రతినిధులు కలిసి పనిచేయాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్ర మంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ యాకన్న, పలు గ్రా మాల సర్పంచ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించాలి

వేడిగాలుల నేపథ్యంలో కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలి
గంగాపురి ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని మే 5 (నినాదం) :** ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం మంథనిలోని గంగపురి ఐకెపి కొనుగోలు కేంద్రాన్నీ ఆయన పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన పంట పరిమా ణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ ఉన్న పంటను వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రంలో అవసరమైన తార్పా లిన్‌లు సిద్ధంగా ఉంచాలని, గన్నీ బ్యాగుల సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారు లను ఆదేశించారు.వేడిగాలుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్రంలో అవసరమైన సదుపా యాలు కల్పించాలని తెలిపారు.రవాణా వాహనాలు, హమాలీల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఏ డి ఏ అంజని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతులు లాభదాయక పంటలను సాగుచేయాలి

ఆయిల్ ఫామ్, కూరగాయల పంటలపై దృష్టి సారించాలి
వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు
ఘనంగా సుద్దాలలో రైతు వారోత్సవాలు



**సుల్తానాబాద్, మే 05(నినాదం):** రైతులు లాభదాయక పంటలు సాగు చేయాలని వ్యవసా య మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు సూచించారు. ఆయిల్ ఫామ్ కూరగాయల వంటలపై దృష్టి సారించాలని రైతులకు పిలుపు నిచ్చారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలో99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో రైతు వారోత్సవాల కార్యక్రమంరైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశరావు పాల్గొని రైతులతో మాట్లా డుతూ, వ్యవసాయం లో లాభసాటి నిచ్చే ఆయి ల్ పామ్, కూరగాయల పంటలపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృషి వి జ్ఞాన కేంద్రం రామగిరిఖిల్ల నుండి శాస్త్రవేత్త డా క్టర్ వెంకన్నమాట్లాడుతూ, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వివిధ పంటలలో సి ఫారసు చేసిన ఎరువుల పై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం మండల వ్యవసాయ అధికారి ఈ. పైడితల్లి భూసార పరిరక్షణ అందరి బాధ్యత అని తెలియజేస్తూ భూసార పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామ స ర్పంచ్ ఒజ్జ సంపత్, ఏ ఈ ఓ ప్రశాంత్, రాజు, హార్టికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్ , మార్కెట్ కమిటీ సెక్రెటరీ, రైతులు పాల్గొన్నారు.

## అటవీ సంరక్షణపై కలెక్టర్‌తో డీఎఫ్ఓ చర్చలు



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మే5(నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి సిహెచ్. బాలమణి ఐఎఫ్ఎస్ సోమవారం జిల్లా కలెక్టర్ హరితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై చర్చించారు. అటవీ సంరక్షణ చర్యలు, వృక్షారోపణ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, అలాగే శాఖకు సంబంధించిన పరిపాలనా విషయాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో అటవీ అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు. అటవీ విస్తీర్ణం పెంపు, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించినట్లు అధికారులు తెలిపారు.

## బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను
సందర్శించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలన



**చెన్నూర్ మే4 (నినాదం) :** కోటపల్లి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు రాపనపల్లి అంతర్రాష్ట్ర చెక్పోస్టును బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా గారు పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని,భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.సిబ్బంది ఆరోగ్యం,భద్రత దృష్ట్యా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు.పండుగ సమయంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ గారు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ గారితో పాటు చెన్నూర్ సిఐ. బన్సీలాల్,కోటపల్లి ఎస్ఐ.రాజశేఖర్ నీల్వాయి ఎస్సై మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డా.కె.శ్రీధర్**

**పెద్దపల్లి రూరల్, మే5 (నినాదం):** పెద్దపల్లి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని,ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డా.కె.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 2 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (పీడియాట్రీషియన్,3 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎం.బి.బి.ఎస్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని,సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు వేతనం,సివిల్ అసిస్టెంట్ సర్జన్ కి వేతనం రూపాయలు 52,351ఉంటుందని ,ఇతర వివరాలకు 9492457809 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు

**అత్యుత్తమ పరీక్ష ఫలితాలకు యూనిక్ హై స్కూల్ కేరాఆఫ్ అడ్రస్.**

**592 మార్కులతో యూనిక్ హై స్కూల్ ప్రథమ ర్యాంక్ సొంతం చేసుకున్న నాగం పూజ శ్రీ**

**యూనిక్ హై స్కూల్ కేరాఫ్ అడ్రస్**




**కుత్బుల్లాపూర్, మే5 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్ డివిజన్ సూర్య నగర్ లోని యూనిట్ హై స్కూల్ క్రమశిక్షణతో కూడిన అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను, పలు పోటీ పరీక్షలలో విజేతలుగా నిలిచేందుకు కావలసిన విద్యను అందించడంలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా విద్యను బోధిస్తూ 10వ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ఫలితాల సాధనకు యూనిక్ హై స్కూల్ కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తుంది. పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో రాష్ట్ర ప్రభుత్వం గ్రేడింగ్ విధానం ప్రవేశపెట్టిన నాటి నుండి నేటి వరకు పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో ప్రభంజనం సృష్టిస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా యూనిక్ హై స్కూల్ ప్రత్యేకతను చాటుకుంటుంది. యూనిక్ హై స్కూల్ విద్యాసంస్థలో చదువుతున్న ప్రతి విద్యార్థి పై పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చురుకైన విద్యార్థులతో సమానంగా చదువులో రాణించేలా ప్రోత్సహించడంలో యూనిక్ హై స్కూల్ యాజమాన్యం తమ ప్రత్యేకతను చాటుకుంటుంది అనడంలో అతిశయోక్తి లేదని పలువురు విద్యాభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలలో యూనిక్ హై స్కూల్ అద్భుత ఫలితాలు సాధనకు ఉపాధ్యాయుల నిరంతర శ్రమ, ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు విద్యార్థులు ఇష్టంతో కూడిన కఠోర సాధన అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామనే లక్ష్య సాధనకు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఉపాధ్యాయుల సూచనల మేరకు విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా, శ్రద్ధతో పాఠ్యాంశాలు వినడంతోపాటు, ప్రతి అంశంపై ప్రత్యేక ప్రశ్నాపత్రావళిని సిద్ధం చేసుకుని పరీక్షలకు సంసిద్ధులు కావడం అద్భుత 10వ తరగతి పరీక్ష ఫలితాల సాధనలో యూనిక్ హై స్కూల్ సఫలీకృతులవుతున్నారని పలువురు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అనేక కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పదో తరగతి పరీక్ష ఫలితాలను సొంతం చేసుకుంటూ కార్పొరేట్ విద్యాసంస్థలకు తాము ఏమాత్రం తక్కువ కాదని తమ విద్యార్థులు సాధిస్తున్న 10వ తరగతి పరీక్ష ఫలితాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పలువురు విద్యాభిమానులు పాఠశాల యాజమాన్యం పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. రానున్న కాలం లో మరిన్ని అత్యుత్తమ ఫలితాలు సాధించుటకు యూనిక్ హై స్కూల్ యాజమాన్యం అధ్యాపక బృందం విద్యార్థులను ప్రోత్సహించడంలో నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కావలసిన పాఠ్యాంశాలలోని విద్యను బోధించడంతోపాటు భవిష్యత్తులో పలు పోటీ పరీక్షలలో ధైర్యంగా పాల్గొని విజేతలుగా నిలిచే విధంగా విద్యను అందించాలని ఆశాభావం వ్యక్తం చేస్తు న్నారు. 2026 మార్చిలో నిర్వహించిన పరీక్ష ఫలితాలలో 600 మార్కులకు గాను నాగం పూజ శ్రీ 592 మార్కులు సాధించి ప్రథమ స్థాయిలో నిలిచింది. 589 మార్కులతో ఎం లక్ష్మీ వెంకట సాయి ద్వితీయశ్రేణి మార్కులు సాధించ గా, 588 మార్కులు కే దేవిప్రియ, కే సాయి ప్రణీత, ఎం వర్షినిలు తృతీయ స్థాయి మార్కులు సాధించినట్లు పాఠ శాల చైర్మన్ శివయ్య, ప్రధానోపాధ్యాయులు నాగభూషణములు వివరించారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ వినీత్

**నారాయణపేట ప్రతినిధి, మే 5, (నినాదం):** నారాయణపేట జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం నాడు కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



జిల్లాలో శాంతి భద్రతలు, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై కలెక్టర్‌తో ఎస్పీ చర్చించారు. జిల్లా అభివృద్ధికి పరస్పర సహకారంతో పనిచేయాలని,ప్రజల సంక్షేమం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఇద్దరు అధికారులు అభిప్రాయపడ్డారు.

# అటవీ భూముల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

**ఈకో సెన్సిటివ్, సైలెంట్ జోన్ల రక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు,**

**నల్లమల్ల గ్రామాల పునరావాసం వేగవంతం చేయాలి**

**నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ మే 5 ( నినాదం) :** కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నాగర్ కర్నూల్ జిల్లాలోని అటవీ ప్రాంత భూముల సంరక్షణ,ఈకో సెన్సిటివ్ జోన్స్, చెంచులకు కల్పించే పునరావాస గ్రామాల అభివృద్ధి పనులపై, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, అక్రమ ఆక్రమణలను నివారించే విధానాలు, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడే కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..అటవీ భూముల సర్వే, సరిహద్దుల గుర్తింపు, భూముల రికార్డుల నవీకరణ వంటి అంశాలపై రెవిన్యూ అటవీ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అటవీ వనరులను సంరక్షించడంలో స్థానికుల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అక్రమంగా చెట్లను నరికే చర్యలపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అధికారులు హెచ్చరించారు. ఈకో సెన్సిటివ్ జోన్స్ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అటవీ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, తవ్వకాలు, చెట్ల నరికివేత వంటి చర్యలను కట్టడి చేయాలని, రెవెన్యూ, పోలీసు, అటవీ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. టవీ ప్రాంతాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈకో సెన్సిటివ్ జోన్స్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు పర్యావరణ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైన అనుమతులు లేకుండా ఎలాంటి పనులు ప్రారంభించకూడదని, ఎకో సెన్సిటివ్ జోన్ మరియు సైలెంట్ జోన్ల ఏర్పాట్లపై నివేదికల సమర్పణపై జిల్లా కలెక్టర్ పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు అదేవిధంగా నల్లమల్ల అటవీ ప్రాంతం నుంచి తరలించే 4 గ్రామాల ప్రజల కోసం పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామంలో ఏర్పాటు చేయనున్న పునరావాస గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముందుగా ఆర్డిఓ, అటవీ అధికారులు స్థానిక ఎమ్మార్వో ప్రాంతాన్ని సందర్శించి అభివృద్ధి పనులకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేయాలని, పునరావాస గ్రామాల్లో పాఠశాల, అంగన్వాడి, సీసీ రోడ్లు డ్రైనేజీ , విద్యుత్ అవసరాల వ్యవస్థ నిర్మాణాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అక్కడ మెరుగైన వసతులు కల్పించి వారు ఇండ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అటవీశాఖ, రెవిన్యూ శాఖల అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈ ఈ విజయ్ కుమార్, మిషన్ భగీరథ అధికారులు కొల్లాపూర్ అచ్చంపేట ఆర్డీవోలు ఎమ్మార్వోలు అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం చేయరాదు

**జిల్లా కలెక్టర్ హైమావతి**



**సిద్ధిపేట /బ్యూరో, (నినాదం) :** సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళ వారం రోజున జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ గూర్చి సివిల్ సప్లై, డిఆర్డిఓ, పిఏసిఎస్, మిల్లర్ యజమానులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, మార్కెటింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సెంటర్ వారిగా తేమ శాతం వచ్చి లిఫ్ట్ చెయ్యడానికి తయారుగా ఉన్న ధాన్యం వివరాలు, ఎన్ని లారీలు పంపించాలని సమీక్షించారు. అవసరం ఉన్న సెంటర్ లలో లారీలు ఎక్కువ ఉండేలా చూడాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.ప్రతి రోజు టాబ్ ఎంట్రీ చెయ్యాలని, 3 రోజుల్లోపూ రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.లారీలలో నింపిన ధాన్యం సైతం టర్పాలిన్ కప్పుకుని మిల్లులకు పంపించాలని తెలిపారు.సెంటర్ లలో తేమ శాతం వచ్చిన ధాన్యం లారీలలో లిఫ్ట్ చేసేందుకు సెంటర్ సిబ్బంది, మిల్లులో ధాన్యం దిగుమతి కి ఎక్కువ మంది హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని మిల్లర్ యజమానులను ఆదేశించారు.అకాల వర్షాల బారిన పడకుండా రాత్రి వేళల్లో టార్పాలిన్ కప్పుకోవాలని రైతులకు తెలిపారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలులో జాప్యం కాకుండా సెంటర్ సిబ్బంది ఎల్లపుడు అప్రమత్తంగా ఉంటూ అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజ, డిఎం సివిల్ సప్లై గోపి కృష్ణ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిఎం మార్కెటింగ్ నాగరాజు, డిపిఓ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

# సాదా బైనామా భూభారతి... పెండింగ్ అప్లికేషన్లను త్వరితగతన పూర్తి చేయండి

**అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



**మేడ్చల్ కలెక్టరేట్, మే5 (నినాదం):** సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి.మంగళవారం ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ ఆఫీస్‌ను కీసర ఆర్డిఓ రాజేష్ కుమార్ తో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి.ఆకస్మికంగా తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించి పెండెన్సి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారును ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూమి రికార్డుల సమగ్ర పోర్టల్ భూభారతి లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారా నికి సూచనలు జారీ చేసారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతి న పూర్తి చేయాలన్నారు. పెండెన్సికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా, భూభారతిరికార్డులను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య పాల్గొన్నారు.

N NADAM CINEMA

# సుకుమార్‌తో రామ్‌చరణ్ తదుపరి చిత్రం

**జూలైలో పట్టాలకెక్కే అవకాశం**



కథానాయకుడు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాని ఇప్పటికే పూర్తి చేశారు. ఇది జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఇప్పుడు అందరి చూపు ఆయన తదుపరి చిత్రంపై పడింది. 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాకి సుకుమార్ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఓ కొలిక్కి వచ్చాయని.. సుకుమార్ దీనికి తుది మెరుగులు దిద్దడంలో తలమునకలై ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర కబురు బయటకొచ్చింది. ఈ కొత్త చిత్రాన్ని జులైలో పట్టాలెక్కిం చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మైత్రీకి చెందిన నిర్మాతల్లో ఒకరైన చెర్రీ వెల్లడించారు. 'రంగస్థలం' విజయం తర్వాత చరణ్ – సుక్కు కలయికలో రానున్న రెండో చిత్రం కావడంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. దీనికి తగ్గట్లుగానే ఈసారి సుకుమార్ తనదైన శైలిలో మరో శక్తిమంతమైన మాస్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# విశ్వంభర బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్

**హరిగౌరవకు అప్పగించిన చిత్రబృందం**




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా సోషియో–ఫాంటసీ చిత్రం విశ్వంభరపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న చిరంజీవి, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'బింబిసార'తో సక్సెస్ అందుకున్న దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. పురాణాల నేపథ్యంలో 14 లోకాల కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది. లోకాలను కాపాడే రక్షకుడిగా చిరంజీవి వింటేజ్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష కృష్ణన్ నటిస్తోంది. దాదాపు దశాబ్దం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం విశేషం. అలాగే ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జూలై 10న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో ఆసక్తికర మార్పు చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం, నేపథ్య సంగీతం బాధ్యతలను యువ సంగీత దర్శకుడు హరి గౌరకు అప్పగించినట్లు తెలుస్తోంది. పాటల కంపోజిషన్‌ను కీరవాణి చూసుకుంటుండగా, భారీ యాక్షన్ సన్నివేశాలు, ఫాంటసీ ఎలిమెంట్స్‌కు పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే బాధ్యతను హరి గౌర తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన తన పనిని ప్రారంభించారని సినీ వర్గాలు చెబుతున్నాయి. హరి గౌర గతంలో చేసిన ప్రాజెక్టులు ఆయన ప్రతిభను నిరూపించాయి. ముఖ్యంగా హనుమాన్ చిత్రానికి అందించిన సంగీతం మంచి ప్రశంసలు అందుకుంది. అలాగే 'మిరాయ్' వంటి సినిమాలకు ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెలోడీస్‌తో పాటు గూస్‌బమ్స్ తెప్పించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇవ్వడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో 'విశ్వంభర'లో హరి గౌర ఎంట్రీ సినిమాకు మరో ప్లస్ పాయింట్‌గా మారనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ విజువల్స్‌తో వస్తున్న ఈ చిత్రానికి ఆయన ఇచ్చే నేపథ్య సంగీతం ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సల్మాన్‌తో రొమాన్స్ చేయబోతున్న కరీనా కపూర్..

**11ఏళ్ల తర్వాత హిట్ కాంబో రిపీట్!**

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత వేగంగా సినిమాలు చేస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నారు. టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లితో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కించిన ఆయన, మరో క్రేజీ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. 'ది ఫ్యామిలీ మ్యాన్, ఫర్జీ వంటి వెబ్ సిరీస్‌లతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ డైరెక్టర్స్ రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో సల్మాన్ ఒక సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా గురించి వినిపిస్తున్న విశేషాలు సినీ వర్గాల్లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. హాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం 'హ్యాంకాక్' తరహాలో ఈ సినిమా ఉండబోతోందట. సూపర్ హీరో ఎలిమెంట్స్‌కు రాజ్ అండ్ డీకే మార్క్ కామెడీని జోడించి ఈ కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఒక అసాధారణ శక్తి ఉన్న వ్యక్తి సమాజంలో సామాన్యుడిగా ఎలా ఉంటాడు? తన శక్తులతో ఎలాంటి విన్యాసాలు చేస్తాడు? అనే అంశాలను చాలా వినోదాత్మకంగా, కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నా తాజాగా, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ సరసన స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ నటించబోతున్నట్లు సమాచారం. వీరిద్దరూ గతంలో క్యోంకి, బాడీగార్డ్, బజరంగీ భాయిజాన్ వంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించారు. సుమారు 11ఏళ్ల విరామం తర్వాత ఈ హిట్ జోడీ మళ్ళీ వెండితెరపై సందడి చేయబోతుండటంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. అయితే ఈ చిత్రాన్ని అతుల్ అగ్రిహోత్రి నిర్మిస్తుండగా, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి కాబోతున్నట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలలో రూపొందనున్న ఈ సినిమా షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుందట. రాజ్ అండ్ డీకే శైలి మేకింగ్, సల్మాన్ ఖాన్ మాస్ ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాదే షూటింగ్ మొదలుపెట్టి వచ్చే ఏడాది సమ్మర్ లేదా ఆ తర్వాతి సీజన్‌లో సినిమాను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# విజయ్ విజయంతో మారిన సీన్

**జననాయగన్ విడుదలకు క్లీయర్ కానున్న లైన్**




తమిళ స్టార్ హీరో జోసెఫ్ విజయ్ సినీ ప్రయాణంలో అత్యంత కీలకంగా నిలిచిన చిత్రం 'జన నాయగన్' ఇప్పుడు ఇండియన్ సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను తన ఆఖరి చిత్రంగా ప్రకటించిన విజయ్, ఇకపై పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతిభావంతుడైన దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం అసలు ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. నిర్మాణంలో ఆలస్యం, రాజకీయ పరిస్థితులు, అలాగే అనుకోని అడ్డంకులు 'జన నాయగన్' ప్రయాణాన్ని కష్టతరం చేశాయి. ఇంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన ఓటిటి డీల్ కూడా మధ్యలో నిలిచిపోయినట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో సినిమాపై ఉన్న హైప్ కూడా కొంత వరకు తగ్గిందనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ కలిసి సినిమా ప్రభావం తగ్గిపోయిందనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు 'జన నాయగన్'కు పూర్తిగా కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆయన అభిమానుల్లో అపారమైన ఉత్సాహం కనిపిస్తోంది. ఒక హీరోగా మాత్రమే కాకుండా, నాయకుడిగా కూడా విజయ్‌పై ఉన్న విశ్వాసం ఇప్పుడు మరింత బలపడింది. ఇప్పటికే గతంలో 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం' వంటి భారీ ప్రాజెక్ట్‌తో విజయ్ తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించారు. భారీ బడ్జెట్, భారీ అంచనాల మధ్య వచ్చిన ఆ సినిమా కూడా అనుమానాలను చెరిపేసి మంచి వసూళ్లు సాధించింది. ఇప్పుడు అదే స్థాయిలో, అంతకంటే ఎక్కువగా 'జన నాయగన్'పై అంచనాలు నెలకొన్నాయి.ముఖ్యంగా, ఒక నటుడు ముఖ్యమంత్రిగా మారిన తర్వాత విడుదలవుతున్న అతని ఆఖరి సినిమా కావడం ఈ చిత్రానికి అదనపు క్రేజ్ తీసుకొచ్చింది. అభిమానులు ఈ సినిమాను కేవలం సినిమాగా కాకుండా, ఒక భావోద్వేగంగా చూస్తున్నారు. తమ హీరో రాజకీయాల్లో విజయం సాధించిన ఆనందంలో, 'జన నాయగన్' ఓపెనింగ్స్ కోలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా రికార్డులు బద్దలు కొట్టే అవకాశముంది.

# ఓటిటిలోకి వచ్చేసిన పాపం ప్రతాప్




టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ నటుడు తిరువీర్ హీరోగా నటించిన లేటెస్ట్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పాపం ప్రతాప్' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం సుమారు మూడు వారాల తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు వస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్' ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా మే 7 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఎస్పీ దుర్గా నరేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తిరువీర్ సరసన పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించగా, అజయ్ ఘోష్ కీలక పాత్రలో మెరిశారు. తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్న ప్రతాప్ అనే యువకుడికి, పెళ్లయిన మూడు రోజులకే తన భార్య దూరమవ్వడం.. ఆమె తనపై ఒక వింత ఆరోపణ చేయడం అనే ఆసక్తికరమైన పాయింట్‌తో ఈ సినిమా సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే సహజసిద్ధమైన కామెడీ మరియు భావోద్వేగాల కలయికతో రూపొందిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతుండడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11,
3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787